

# రాధికాస్వామి

అనంతాకాశం అపార పారావారంలో అందంగా ప్రతిఫలించి, అలలు అలలుగా తేలివచ్చింది తీరానికి. ఆ తరంగ శీకర సందోహంలో నీలి నీడల ఛాయలు వింతగా తోచి కలవర పాటుకి కారణా లయినాయి.

తరంగ బృందాలు తరలి మరలాయి. ఘోష మాత్రమే కర్ణపుటాల మార్మ్రోగింది...

* * *

ఏనాటి గాధ ? జీవితం నిస్సార మనిపించినప్పుడు, హృదయం మ్రోడై

ప్రతిమాదేవి

నప్పుడు, లోకం శూన్యమై తోచినప్పుడు, దృష్టి పథాన గతం విశాలమై పఱచుకుని, ఒక్కసారిగా, విదారకంగా దుఃఖిస్తుంది హృదయం, గడచినవే మంచి రోజు లంటూ !!

—సీతని చూడాలని వచ్చి తానెంత మహా సంఘటన నెదుర్కొన్నాడు ? తా నూహించని, తన భావనలు ఏనాడూ స్ఫురించని, ఏదో, ఏదో వచ్చి తన నావరిస్తోంది !!

గుండెలు నిండిన బాధలెన్ని తన కిప్పుడు! కాలం వృధా అయి పోయిందని! లోకం తనను వంచించిందని కాదు... తనను తానే వంచించు కున్నాడని !! భూత భవిష్యత్తులపై 'జరిగి ఉంటే' 'జరిగితే' అనేవి శేష ప్రయోగాలతో



జీవితౌన్నత్యం కొలుచుకున్న తాను సత్యం గుర్తించే సమయ మాసన్నమయే సరికి ప్రతి అల్ప సన్నివేశమూ, క్షణము కూడా అనల్ప దోషాలకు కారణభూతమై తన నధఃకరించాయని పశ్చాత్తాప పడుతున్నాడు! ఈ పశ్చాత్తాపమూ, ఈ తపనా తనకు కొత్తకాదు. కాని లౌకిక జీవిత విషమ వ్యాపారంలో ఒక్కక్షణ మైనా తలెత్త నివ్వకుండా చేశాడు వాటిని! ఇప్పుడవి చెలరేగినాయి! అవును! ఇంకెంత కాలం ఓర్చుకుంటుంది హృదయం ఈ కఠిన కల్మష జీవితాన్ని?

'దేవా! నా హృదయంలో
లావా ప్రవహిస్తున్నది!!'

—కాని, ఈ 'లావా', ఈ బాధ మధురంగానే ఉన్నది ఈదుఃఖమాధుర్యం హృదయాని కనుభూత మౌతున్న కొద్దీ, ఏకాంతంగా మఱింత బాధపడాలని ఉంది హృదయంలో'! ఒక్కొక్క క్షణాన తన హృదయం అవధులులేని ఆకాశపథాన అనంతంగా పఱచుకుని గంభీర ప్రతిభా విశేషంతో ఉప్పొంగి పోతుంది! మఱొకప్పుడు యుగయుగాలు తరలి, మరలి, ఏనాటి బృందావన మైదాన సీమలలోనో విశ్రాంతిగా, వేణుగాన మాధుర్యంలో లీనమై సోలుతుంది! రోదసీ గోళంలోని మానవానీకపు బాధామయ గాథలన్నీ నిశీధి గర్భాన నిశ్శబ్దంలో మార్మోగే కీచుఱాళ్ళ ఘోషలో శ్రుతమౌతాయి తన హృదయానికి! ఆకాశపు గాంభీర్యమూ, ప్రకృతి ప్రశాంతీ, నిశీధి నిశ్శబ్ద మాధుర్యమూ క్షణక్షణానికీ తన కనుభూతమై హృదయపు టార్ద్రితంతువుల నన్నిటినీ ఝళిపించి, మేల్కొలిపి, వింత మాధుర్యంతో కప్పివేసి కలవరపెడతాయి తనను!'

—ఊరిబయట పర్ణశాల! ఎదురుగా విశాలమైన చక్కని, పచ్చని మైదానం ఆ పచ్చిగడ్డిమీద, చేతుల్నీ, కాళ్ళనీ వాటి యిష్టానికి ఒదిలేసి, వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్నా డతను!!

ఎప్పుడూ ఈవిధంగా ఎందుకు గడపక పోయాడు! ఎన్నటిదో ఈ శాంతి ఆత్మలో! ఎందుకు విస్మరించాడు??

అతనికి పశ్చాత్తాపం కలిగింది
కాని,—
ఎలా గడుపుతాడు?

స్మృతి విహాయస పథంలో, ఏ దివ్య నక్షత్రాలనో లెక్కించుకునే అతని హృదయం ఏ కారణంగానో బాధతో ఆగి దుఃఖించింది అతని కళ్ళలో ముత్యాల బిందువులు నిలిచాయి.

# 1

చిన్నప్పటినుంచీ తను బొమ్మలు గీసేవాడు. ఏడెనిమిదేళ్ళ కుఱ్ఱవాడప్పుడు కాకి, పిల్లిలాంటి బొమ్మలు ప్రయత్న రహితంగా సుద్దముక్కతో నేలమీద గీస్తూఉంటే చూసి, ఒకసారి 'ఒరే గోపీ! నువ్వు గొప్ప ఆర్టిస్టు వౌతావురా!' అంది.

అత్తకూతురు సీత. ఆవిడ వాక్ప్రభావ మేమిటో కాని, నిజంగానే తను అంత వాడూ అయ్యాడు. ఆ పిచ్చిగీతల్లో సీతకు తోచిన ఉజ్జ్వల భవిష్యత్తు ఏమిటో? అంతగా 'ప్రాఫెసీ' చేసినట్లు చెప్పేసింది!

ఉంగరాల జుట్టు నుదుటిమీద పడుతూ ఉంటే, పైకి తోసుకుందుకైనా తీరిక లేదన్నట్లు, — తీరిక కూడా కాదు, — కదిలితే భావం కఱిగిపోతుందేమో ననే భయంతో గంటలతరబడి — ఆ రంగులూ, కుంచెతో పొద్దుపుచ్చేవాడు తను!'

'తెలివి రానీయకే!

కల కఱిగిపోతాది' —

గీసిన బొమ్మల్ని తిరిగి తిరిగి చూసుకుంటూ ఎంత మురిసిపోయేవాడు! తను పోయినా, తన చిత్రా లమరమై వర్ధిల్లుతాయనుకునేవాడు. ఎంత ఆనందం ఈ భావనలో? జీవితం పూచిన నందనవనమైనంత! జీవిత సార్ధకత్వమంతా సాధించినంత!!

రాత్రింబగళ్లు నిద్రాహారాల స్ఫురణ లేకుండా తను బొమ్మలు గీసేవాడు. తల్లి అప్పుడప్పుడు తన ఈ వెఱ్ఱితనానికి నవ్వుకొంటూ 'అన్నంతిని వేసుకోరా బాబూ!' అనేది వాత్సల్యంగా.

తన కెక్కడలేని కోపమూ ముంచుకు వచ్చేది ఆమాట వింటే!

'అబ్బ! మాట్లాడించకమ్మా! ఎప్పుడూ అన్నమేనా? నా కొద్దు' అనేవాడు.



"మరో మూడేళ్ళు పెరిగితే మన మార్కెట్టు రేటు పెరుగుతుందనుకున్నాను కాని ఈ వరకట్న నిషేధ చట్టం వచ్చేసిందికదా. ఎప్పుడు చేసుకున్నా ఒకటే గనుక ఈ ఎండల్లోనే చేసేసుకుంటున్నాను"

---

'నీకు అన్నమే కాదురా బాబూ! ఏమీ అక్కర్లేకుండా పోతున్నాయి!' అనేది ఆవిడ.

'అవును. ఇది ఒక తపస్సు!' అనుకునేవాడు తను మళ్ళీ చిత్రలేఖనంలో లీనమైపోతూ.

'ఒరేయ్! నువ్వు జగద్విఖ్యాత కళాకారుడి వౌదువుగాక! అని నేను వరమిస్తున్నాగానీ ముందా మాసిన బట్టలు మార్చరా బాబూ!' అనేవాడు పేరుకే కాక రూప సార్ధకతకూడా కలిగిన వామనమూర్తి.

కాని తనకు లక్ష్య ముండేది కాదు. అతని గోల అతనిదే ! తన ధ్యాస తనదే ! అఱిచి అఱిచి, ఓటమి గీసిన వెట్టి ముఖంతో వెళ్లిపోయేవాడు వామనమూర్తి.

కిటికీ కెదురుగా స్టాండు పెట్టుకుని బొమ్మలు గీస్తూ ఉండేవాడు తను. తీరిక వేళ కిటికీలోంచి చూస్తూ కూర్చుంటే ఎన్నెన్ని అమూల్య భావ పరంపరలు పఱుగులెత్తేవి హృదయంలో ! ఎన్నెన్ని ఊహాతీత దృశ్యాలు ప్రతిఫలించేవి మనసులో ! వాటిని మించి వాస్తవిక ప్రపంచ స్ఫురణే ఉండేదికాదు తనకు ! ధార జలధరాలు, రాగ సంధ్యలు, చలువ వెన్నెలలు, మనోహర మలయానిలాలు, కమనీయ పుష్ప సౌరభాలు, పచ్చని పట్టు తివాసీల పచ్చ పైరులు ఇవన్నీ ఎప్పటి కప్పుడు ఎంత సుందరమై, సుపరిచితమై తోచేవో, అంతటి నవనవోన్మేషిత భావ సంపదతో తనలో కళా సామగ్రిని పెంపొందించేవి. అసలు ఒకటనేమిటి ? రమయణీయ ప్రకృతీ రాగమంతా ఆనాడు తనలోంచే ఉద్భవమైంది ! ప్రతి ప్రకృతి సౌందర్యంలోంచీ తాను జనించాడు ! ఎంత అవినాభావ సంబంధం సౌందర్యానికీ, తనకూ ఆనాడు !! ఆ కిటికీలోంచి చూస్తూఉంటే ప్రతి ఋతువూ, ప్రతి దృశ్యమూ ఒక విలక్షణత్వ మాపాదించుకునేది తన దృష్టిలో ! అది ఒక స్వాప్నిక జగత్తు ! అనిర్వచనీయ మనోజ్ఞ సౌందర్యానుభూతి ! మధుర ప్రశాంతి !

'స్వప్న జగతిలో ఛాయావీణా
సమదశ్రుతులెవో సాగు నవే !' —

తన హృదయాన్ని తా నెంతచక్కగా ఆలకించ గలిగేవా డప్పుడు !

ఆ జీవిత మంత నిర్మలమై, తన హృదయ మంత స్వచ్ఛందమై, నేడు తనను కలవరపరచే వాస్తవిక ప్రపంచానుభూతులు తన అంతస్సుకి ఆమడ దూరాన ఉండేవి ! కాని అదే నిలవలే దెప్పుడూ !!

## 2

తనకు దగ్గు వస్తోంది తన ఆరోగ్యం మీద తనకు శ్రద్ధలేదు. 'ఇదేముందిలే !' అనుకుంటూ గడిపాడు చాలా రోజులు. కాని, నుంచుని బొమ్మలు పెయింట్ చేయబోతే కాస్సేపటికి కాళ్ళన్నీ నెప్పులు ! తదేక దీక్షతో ప్రకృతి దృశ్యాలను వీక్షిస్తూ ఊహావాహినిని పరుగెత్తించలేడు ! తలనొప్పి ! కళ్లు మంటలు ! భరించలేని నీరసం ! !

తన ఆ పరిస్థితిచూసి తల్లి వెంటపడి పోరగా, పోరగా, ఒకసారి వెళ్ళి డాక్టరుకి చూపించుకు వచ్చాడు. అప్పుడుకూడా తనకు జబ్బేమీ ఉండదనే తన ఊహ.

అయితే, తనకు టి బి. అన్నాడు డాక్టరు !


అదే మొదటి మెట్టు తను కొంచెం కొంచెంగా ఈ ప్రపంచంలోకి దిగజారి పోవటానికి. శరీరాన్ని గుఱించి తనలో

ఇంతకుమునుపు లేని భయమూ, ఆందో ళనా అంకురించాయి. తల్లి దుఃఖించింది తనకూ తనమీద ఎక్కడ లేని జాలీ కలిగింది.

మొట్టమొదటిసారిగా, 'చచ్చిపోతానేమో' అనే లౌకిక స్ఫురణతో, భయంతో తల్లిని తీసుకుని మదనపల్లి వెళ్లాడు.

అక్కడి రోగాలూ, నొప్పులూ, బాధలూ, సేవాసహనాలూ, అన్నీ చూస్తూ ఉంటే, జీవితం తన కంటికి మరొక విధంగా ప్రత్యక్షం కాసాగింది. తా ననుకున్న తనలోకం కాదిది......

——కాని, తన జీవితంలో ఆ రోజులు తనకు కనువిప్పు అనిపిస్తూఉంటుంది. తన కత్యంత ప్రేమ పాత్రులు, తనకు అతిసన్నిహితులూకూడా ఒకానొకప్పుడు తప్పని సరిగా తన నొదిలిపోగలరనే భావం తన కందరానిదై ఉండేది కాని అదే సంఘటించింది. పంటల వసూళ్లకు ఊరికి వెళ్లిన తల్లి తిరిగి తన కంటికి కనిపించకుండా, కేవలం హఠాత్తుగా ఈ లోకం నుండి నిష్క్రమిస్తుందని, అలా జరగవచ్చని కాని, జరుగుతుందని కాని ఎప్పుడైనా అనుకున్నాడా తను ? లేదు అందుకే నిస్సారమైన ఆ వార్తకి కలగి పోతూ ఊరు చేరిన తనకు వామనమూర్తి ఏదో వేదాంతం నూరిపోస్తూ ఉంటే తనెంత దుఃఖించాడు !!



ఉపాధ్యాయుడు. మన జ్ఞానేంద్రియములలో మొదటిది కండ్లు, రెండవది ముక్కు, ఆ తర్వాత ఏమిటో చెప్పరా గోపీ ?

గోపి. ఆ. చెప్తానుసార్, మీ మీసం సార్.

---

'ధైర్యం ఉండాల్రా మనిషికి. ఎప్పుడూ మన మనుకునే సుఖమే ప్రాప్తించదురా అసలు —' వామనమూర్తి ఏదో చెబుతున్నాడు తల్లి చావునుగురించి.

బాధతో తన గుండెలు బద్దలవుతున్నాయి. ఎలా పోతేనేం ? పోయింది. ఇంక కనిపించదు బాధలనూ, బంధాలనూ వదల్చుకుని అనంత వాయువుల్లో లీనమైంది. తనకోసం బతికి, తనకోసం దుఃఖించి, తనకోసమే ఊరికి వెళ్ళిన తల్లి తనకు కాకుండా వామనమూర్తి చేతుల్లో పోయింది ఎక్కడ తల్లి ! ఎక్కడి వామనమూర్తి '' కన్నకొడుకు తనకు ప్రాప్తిలేదు అంతా విధి '' !

కట్టలుతెగి వర్షిస్తున్నాయి కళ్ళు '

—అన లామె అనంత వాయువుల్లోనే లీనమైందా ? ఎక్కడకు పోయింది ? ఏమైంది ? తనలో జీవన్మరణ సమస్యలు, భగవంతుడు, లోకం, కర్మానుబంధాలు మొదలైన విషయాలన్నీ మొదటిసారిగా, అర్ధంలేకుండా, దోవ తెలియకుండా కలియబడి ఘర్షణపడుతున్నాయి. ఏమిటిదంతా ?

తన దనుకున్న జీవితం తనదికాకుండా పోతోంది కాల మాసన్నమయేసరికి. యాంత్రికమైన శరీరం జీవితమనే ఫలం సాధిస్తోంది ప్రపంచంలో !! విశాలా పధుల్లేని అత్యల్ప పరిధిలో కాలగమనంతోపాటు గమనస్ఫురణ లేకుండా గమించే యాత్ర ఇది ! ఈ విశాల ప్రపంచంలో మానవుడి స్థానం అత్యల్పం. కాని ఈ స్థానమూ అమూల్యమే '! కాక పోతే ఒక స్థానం ఖాళీ అవుతే కాని అది భర్తీకావటం జరగదు ఇదే నిజం కాక పోతే అప్పుడిక మరణం దేనికనే ప్రశ్నా ఉదయించక తప్పదు.

'నే నేల నిలువరాదో ?
ఈ నాదు పోలమునడుమ !
క్రింది కీ వెపుడు పడెదో !
అపుడె ని న్నరసికొనుచు !!—

కొత్తా, పాతా జనాన్ని చూస్తూ కల కాలం తనెందుకు నిలవకూడ దీ భూమి మీద ? నిలవటానికి వీల్లేదు కనుకనే ! కొత్త జలాలు పాత జలాన్ని తోసి వేస్తాయి. అంతే ! ఋణం తీరింది. తల్లి పోయింది. తనుమాత్రం పోక నిలుస్తాడా?

విషాదభరితమైన హృదయంలో అంకురించిన వేదాంతం ఒకవిధమైన శాంతికి హేతుభూతమైంది. క్రమంగా తను తల్లి మరణదుఃఖం మఱచిపోతున్నాడు.

* * *

కాలం భారంగా గడుస్తోంది. కాలం మానసికబాధ కౌషధం. కాని ఎంత విస్మృతిలో పడుతున్నా. తల్లి వియోగ బాధ తన హృదయాన్ని దుర్భరంగా పీడిస్తూనేఉంది.

ఇప్పుడూ బొమ్మలు వేయటం మానలేదు వేస్తూనే ఉన్నాడు. కాని ఆకలి దప్పుల ప్రాముఖ్యం అధికమవుతోంది. ఇంతకుమునుపు తన ఆకలికి అండ ఉండేది తన ప్రాణం ఆకలి దప్పుల నెఱగకుండా శోషిల్లి పోతుందేమో నని తల్లడిల్లే తల్లి లేకపోవటంతో పాపం పొట్ట తన ఆకలి తనే చూసుకొంటోంది

ఉన్న స్థిరచరాస్తులు చాలావరకు క్షయరోగం మింగేసింది మిగిలిం దేమీ లేదు. తన అవసరాలు తనే చూసుకోవాలి. తనను గుఱించి శ్రద్ధ ఎవరికింక ?

ఉపాధి రహితు డిప్పుడు తను !

వేసిన కొత్తా, పాతా బొమ్మల్ని పట్టుకుని చెన్నపట్నం బయలుదేరాడు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించటానికి '!

## 3

అదృష్టం అదృశ్యమైనది. కంటికి కనిపించకుండా, బుద్ధికి అందకుండా ఎప్పుడెలా వచ్చి అది మానవుణ్ణి వరిస్తుందో చెప్పటం కష్టం. ఈ అదృష్టా దురదృష్టాల మూలకంగానే జీవిత మతి విచిత్రమైనది.

అది తన జీవితంలో రెండో అధ్యాయం. అభ్యుదయ చిత్రకారుడుగా తాను గుర్తింపబడిన సమయం. నిజానికీ దశ తన కదృష్టమే ఇచ్చిందో, దురదృష్టమే తెచ్చిందో నిర్ధారించలేడు తను! ఒక విధంగా ఆలోచిస్తే రెండూ ఇచ్చిందేమో!

ఎగ్జిబిషన్‌లో తన చిత్రా లమితంగా ప్రజాదరణ పొందాయి. ఎంతో మంది వాటిని కొన్నారు కూడాను. ఎగ్జిబిషన్ అయిపోయాక మిగిలిన చిత్రాలను మెడ్రాస్‌లో తెలుగువాళ్ళందటి ఇళ్ళకూ తిరిగి అమ్మదలచుకున్నాడు తను. ప్రొఫెసర్ రావుకి కళాభిమాన మెక్కువని చెప్పారెవరో! అందువల్ల తను ముందు అక్కడికి వెళ్ళాడు.

తను వెళ్ళేసరికి ప్రొఫెసర్ రావు ఈజీఛైరులో పడుకుని పేపర్ చదువుతున్నాడు వరండా మెట్లమీద తొట్లలో చక్కని పూలచెట్లు అందమైన పూలతో విచ్చి ఉన్నాయి. రావు ప్రసన్నంగా, శాంతంగా ఉన్నాడు.

ఇప్పుడనిపిస్తుంది రావుని మొట్ట మొదటిసారిగా అలా చూసినప్పుడు ఆయన తన జీవితంలో ఒక ప్రముఖ పాత్రవహిస్తాడనే ఊహే లేకపోయింది. తలుచుకుంటే అంతా ఆశ్చర్యంగా ఉంటుంది......

తానెవరో, ఎందుకు వచ్చాడో చెప్పుకుని, రావుకి తన చిత్రాలు చూపించాడు. రావు తదేకదీక్షతో వాటిని పరిశీలిస్తున్నాడు. ఒక్కొక్క చిత్రం చూస్తున్నకొద్దీ ఆయన ముఖంలో రంగులు మారుతున్నాయి. తను మాత్రం ఉత్కంఠతో ఆయన సమాధానానికై నిరీక్షిస్తున్నాడు!!



"ఏమండీ ఎడిటర్ గారూ! నేను వ్రాసిన స్క్రిప్ట్ అట్లాగే ప్రింటు చేశారు, రైటింగ్ అంత బాగుందా?"

"మీరు వ్రాసిన స్క్రిప్ట్ చదవటం మావల్ల కాక అట్లాగే బ్లాకు చేయించి ప్రింటు చేశాము."

'కస్తూరీతిలకం లలాటఫలకే వక్ష స్థలే కౌస్తుభం...' శ్లోకానికి తను గీసిన చిత్రం అది.

దానిని చేత్తో పట్టుకుని రావు హఠాత్తుగా తన వేపు చూసి అన్నాడు

'లీలాశుకుడు సృష్టికి నిర్వచనమిస్తే దానికి మీరు రూపమిచ్చారు.'

తను విభ్రాంతి పడిపోయాడామాటలకు! నిజంగా తను అంత గొప్పగా గీసాడు ఆ చిత్రాన్ని??

తన అన్ని చిత్రాల్నీ చూసి వరసగా పేరుస్తూ 'జన్మతః కళాభిజ్ఞులు కావటం అంటే ఏమిటో నాకిప్పుడు బాగా అర్థమవుతోంది ఇన్నాళ్లు, ఇంత బాగా వేస్తూ ఎక్కడ దాక్కున్నావు?' అన్నాడు రావు ఆర్ద్రమైన కంఠంతో

తను సిగ్గుపడి పోయాడు.

'వృద్ధుడి నిండుతనంతో, వాత్సల్యంతో చనువు తీసుకుంటున్నాను ఏకవచనంతో పిలిస్తే ఏమీ అనుకోవుగా?' అన్నాడు మళ్ళీ

'లేదు లేదు. మీరలాగే పిలవండి. పరవాలేదు' అన్నాడు తను

తన కంఠంలో ఆడపిల్లల తొట్రుపాటు, లాలిత్యం ధ్వనించిందేమో!! రావు నవ్వాడు

'ఉండు మా అమ్మాయిని పిలుస్తాను దానికి ఆర్ట్ అన్నా ఆర్టిస్టులన్నా పిచ్చి!' అంటూ రావు 'రాధా! రాధా!' అని పిల్చాడు.

పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళ రాధ ఎదురుగుండా వచ్చింది 'ఏమిటి నాన్నా?' అంటూ.

రావు కూతురికి తనని పరిచయం చేసాడు. నమ్రతగా నమస్కరిస్తూ కుర్చీలో కూర్చుందామె

'చూడు రాధా! ఈ బొమ్మలు ఎలా ఉన్నాయో, ఎక్కువగా నీ కేవి నచ్చినయ్యో చెప్పు చూద్దాం' అంటూ రావు రాధకి చిత్రాల్ని చూపించాడు.

రాధ నవ్వుతూ వాటిని అందుకుంది.

'మీదే ఊరు?' అంటూ రావు తన పుట్టుపూర్వోత్తరాలడిగి తెలుసుకుంటున్నాడు.

కాస్సేపాగి రాధ తమ సంభాషణ కడ్డువస్తూ 'నాన్నా, ఈ బొమ్మలన్నిటిలో రంగుల మిశ్రమం ఎంత బావుందో చూసావా?' అంది చేత్తో ఒక చిత్రం పట్టుకుని

రావు ప్రసన్నంగా నవ్వి 'అవునమ్మా! ఏది ఆ బొమ్మ?' అన్నాడు రాధ చేతిలో చిత్రంకోసం చెయ్యి జాపుతూ.

రాధ దానిని తండ్రి కందిస్తూ 'సీతని మేలిమి బంగారు ఛాయ అనీ, రాముడ్ని నీలమేఘ శరీరుడనీ వర్ణించిన కవులు కూడా ఆ వర్ణనల కాంతి ఇటువంటిది అని నిర్ధారించి ఉండలేకపోవచ్చు నాన్నా! కాని ఈయన 'మీ రూహించిన ఆ కాంతి, ఆ రంగు ఇదే!' అని వారి ఊహాకి రూపమిచ్చినట్లనిపిస్తోంది' అంది.

ఆమె ముఖంలో ఊహించని అందం చూసినప్పటి కళాకారుడి ఆనందం ప్రస్ఫుట మవుతోంది

రావు మెల్లిగా తల ఊగించి నవ్వు ముఖంతో 'చెప్పమ్మా!' అన్నారు కూతురికి ప్రోత్సాహమిస్తూ.

'అసలు సామాన్యంగా అందరూ మేలిమి బంగారుఛాయ అంటే పసుపు పచ్చని వర్ణాన్నో, లేకపోతే బంగారు కాంతో, గులాబిరంగో తేలని రెండిటి మిళాయింపయిన ఒక పాలిపోయిన రంగునో తేలుస్తారు. ఇంక నీలమేఘ కాంతి అంటే నల్లటి నలుపునో, నీలపు రంగునో చిత్రిస్తారు కాని ఇటువంటి రంగు నేనింతవరకూ ఎక్కడా చూడ లేదు నాన్నా! నిజంగా తామూహించే ఆ శరీరకాంతి ఎటువంటిదో చెప్పటానికి భాష దొరక్క మేలిమి బంగారు కాంతి, నీలమేఘ కాంతి అని ఊరుకున్న కవులకు ఈ చిత్రం చూస్తే ఎంత ఆనందం కలుగుతుంది? నిజంగా నా కలాగే అని పిస్తోంది నాన్నా!'

కూతురిలో ప్రేరిత మవుతున్న కళా తృష్ణకు రావు ఆనందంతో విరిసిన ముఖంతో తనవేపు చూశాడు.

'చూసావా! నేనంటే సిగ్గుపడ్డావు! కాని మా అమ్మాయికూడా నీ బొమ్మల్ని మెచ్చుకుంటోంది!' అన్నాడు.

'అది మీలోఉన్న కళాభిరుచికి నిదర్శ నం. నిజంగా నే నంతవాడ్ని కాదు!'




"ష్ వురేయ్ పొదలోంచి పులొస్తుంద్రోయ్ తర్వాత కాలుద్దాంగాని కొమ్మను గట్టిగా పట్టుకో. కాలు జారి క్రింద పడితే పీక్కు తింటుంది."

"నీ కింత భయమేరా. నీ కంటే ముందే పట్టుకున్నానులే."

---

అన్నాడు తను ఎలాగో గొంతు పెకల్చు కుని

'కాదు కాదు, నేను అబద్ధం చెప్పడం లేదు. మీ బొమ్మలు చూసి నేనేం ఫీల య్యానో అదే చెబుతున్నాను ఈ 'ఛాయాసీత' బొమ్మలు మీరు సీతనీ, రాముణ్ణీ చిత్రించిన తీరు, రంగులు వాడిన విధానం ఎవరికైనా ఇటువంటి ఉద్దేశాన్నే కలిగిస్తుంది ఇంతవరకూ నేను రాము డికీ, కృష్ణుడికీ నల్లటి నలుపునీ, నీలపు రంగునీ చిత్రించటం చూసాను కాని ఇటువంటి రంగు ఏ చిత్రకారుడు వాడగా చూడలేదు! నిజం!' అంది రాధ తన మాటలపై విశ్వాసాన్ని నొక్కి పల్కుతూ.

తను నవ్వి అన్నాడు

'చిత్రలేఖనంలో ఎవరి ఒంటి రంగు వారికి తెప్పించవచ్చు ఇది నిజంగా కష్టమేకాని గొప్ప కళ!'

రాధ వెంటనే ఉత్సాహంగా అందుకుని 'అదే నే నీ బొమ్మల్లో చూస్తున్నాను' అంది.

'ఊఁ. మరి నీకు ఏవి నచ్చినయ్యో సెలెక్టు చెయ్యమ్మా! పాపం! ఆయన వచ్చి చాలా సేపైంది!' అన్నాడు రావు.

రాధ నవ్వుతూ చిత్రాలవేపుకి దృష్టి సారించి 'చాలా కష్టమైన పని నాన్నా ఇది! అయినా నా కివ్వి నచ్చినయ్యి' అంటూ కొన్ని చిత్రాలను తీసి తండ్రికి అందించింది.

'ఏవి?' అంటూ రావు వాటిని అందుకుని చూసాడు. తర్వాత నవ్వుతూ 'భేష్ నాకంటే మంచి టేస్టే చూపించావమ్మా!' అన్నాడు.

తను ఆమె సెలక్టుచేసిన చిత్రాలు తీసికొని చూచాడు రావు అన్నట్లుగా రాధ మంచి అభిరుచే చూపింది. తను గొప్పవిగా భావించే 'ఛాయాసీత' 'అన్వేషణ' చిత్రాలను ఎగ్జిబిషన్‌లో అంత మంది లోనూ ఒక్కరూ తీసుకోలేదు వాళ్ళు కేవలం కంటికి నదరైనవీ, కోమలమైన స్త్రీల చిత్రాలూ తీసుకుని తన కళని ప్రశంసించి పోయారు ధనావశ్యకతలో అప్పటికి ఆ ప్రశంసలే తనకెంతో ఆనంద మిచ్చాయి కాని ఇక్కడ తన కళకు నిజంగా న్యాయం జరగ గలదన్న ఆశ అంకురిస్తోంది స్నేహపూర్వకమైన ఆ తండ్రీ కూతుళ్ల విమర్శ, పేరునిబట్టి కాక విలువను గ్రహించి వారు తన చిత్రాలపట్ల చూపిన అవధానమూ, ప్రాముఖ్యమూ ఇవన్నీ చూస్తుంటే నిజంగా తన కళకు ఇక్కడ న్యాయం జరుగగలదన్న ఆశకలుగుతోంది తనకు

అసలు వీటన్నిటికంటే కూడా ముఖ్యంగా తన నాకర్షించిందీ, తన ఆశను పురికొల్పిందీ ఒక్కటి. చెక్ బుక్ తీసుకువచ్చి రావు 'నీ చిత్రాలకు నేను విలువ కట్టలేనోయ్! నీకిష్టం వచ్చినంత నీవే వేసి తీసుకో'' అంటూ చెక్‌మీద సంతకంచేసి ఇచ్చాడు తనకు

ఊహకు మించిన ఆ సత్కారానికి విభ్రాంతిపడిపోయాడు తను రావు కళాభిమాని అంటే ఏదో అనుకున్నాడు కాని, ఇంతగొప్ప అర్థం తీసుకోలేకపోయాడు. ఈ అనూహ్య సత్కారానికి తనకళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

ఏమీ మాట్లాడకుండా చెక్‌మీద వంద రూపాయలు వేసాడు తను.

'ఇదేమిటీ? ఇంత తక్కువా? మేం ఎన్ని బొమ్మలు తీసుకున్నామో గుర్తుందా? దాదాపు నీ ఆర్ట్ అంతా గుత్తకు పుచ్చుకుంది మా అమ్మాయి!' అన్నాడు రావు ఆశ్చర్యంతో కూడిన నవ్వుతో

'ఇది తక్కువకాదు ఎక్కువే! కళాకారులను సత్కరించటం మీకు తెలుసు. కళాభిమానులను గౌరవించటం నేను నేర్చుకుంటున్నాను. అంతే!' అన్నాడు తను.

రావు కళ్లల్లో వాత్సల్యం వర్షించింది.

'పైకి వస్తావోయ్ బాబూ!' అన్నాడు తండ్రిలా ఆశీర్వదిస్తూ.


—ఆ విధంగా రావుతో పరిచయ మైంది తనకు. రావువంటి వ్యక్తులతో పరిచయమే ప్రాణస్నేహం అయిపో తుంది తను రావు కుటుంబానికి ఆ ఒక్క క్షణంలోనే ఆప్తుడై పోయాడు ఆయన తనకొక పత్రికా కార్యాలయంలో ఉద్యోగ మిప్పించాడు. కాని త్వరలోనే తను మెడ్రాస్ ఆర్ట్ స్కూల్లో టీచరుగా చేరాడు.

అప్పటినుంచీ తను మెడ్రాస్‌లోనే స్థిరపడి పోయాడు.

* * *

ఇల్లంతా కలిపి అద్దెకివ్వాలనే ఉద్దే శంతో, గదుల్లో ఉన్న వాళ్ళందర్నీ ఖాళీ చెయ్యమని ఇంటివాడి ఆజ్ఞ జారీ అయి నెల రోజులు కావస్తున్నా, తనకు వేరే గది వెతుక్కొని వెళ్లే నేర్పే లోపించింది అవతల ఇంటివాడి ఒత్తిడి ఎక్కువౌ తోంది. ఇవతల తనకు వేరే గది దొరక లేదు. ఒకనాడు రావుగారింటికి వెళ్ళి నప్పుడు గది ఎక్కడైనా ఖాళీగా దొరుకు తుందేమోననే ఉద్దేశంతో రాధతో తన గోడు వెళ్లబోసు కున్నాడు.

ఫలితంగా మర్నాడు పొద్దున్నే తను నిద్రలేచే సరికి రావుగారి కారు గేటు ముందాగి ఉంది. తనను చూసి డ్రైవర్



రోగి. బాబుగోరు దూరపు వస్తువులు ఏమీ ఆనడం లేదండి. తమ సలహా కోసం వచ్చాను.

డాక్టరు. దానికేముంది, దగ్గరగావెళ్ళి చూస్తూం డండి, అవే కనబడతాయి.

వినయంగా నమస్కరించి వచ్చి ఒక కవ రందించాడు.

అది రావు రాసిన ఉత్తరం.

నిదానంగా గది వెతుక్కో వచ్చనీ, అంతదాకా తమ ఇంటికి రమ్మనీ, రాక పోతే సాయంకాలం తనే వచ్చి తీసుకు వెళ్తాననీ, తనని రప్పించాలని ఉంటే రాకుండా ఉండమనీ ఉత్తరంలోని సారాంశం.

తనకేమీ పాలు పోలేదు. వెళ్ళకుండా మానితే రావు అన్నంత పనీ చేస్తాడు. సాయంకాలం తనే వచ్చి, నోరు మెదప నివ్వకుండా కారెక్క మని ఆజ్ఞాపిస్తాడు. లాభం లేదు వెళ్ళటమే యుక్త మని పించింది తనకు.

—ఇతరుల ఇళ్ళల్లో ఉండటం తనకు అలవాటు లే దింతవరకూ. సహజంగా మొహమాటస్థుడేమో, రావుమాట తీసి

వేయలేక వెళ్లినా సిగ్గుపడ్డాడు తను.అసలు రాధతో రూమ్ సంగతి చెప్పకుండాఉంటే బాగుండే దనిపించింది. ఇంతకు మునుపు వారాంతంలో తన కార్యక్రమాలలో రావుగారింటికి వెళ్ళటం ఒకటి. కాని ఇప్పుడు పూర్తిగా ఆ యింట్లోకే వచ్చి ఉండటం కొంత బిడియంగానే ఉంది తనకు.

అలా ప్రతిదానికీ తను మొహమాట పడుతూఉంటే రాధ నవ్వేది.

రావు చనువుగా తన భుజం చరచి అసలు నీవంటివాడికి 'నీ' 'నా' అనే భావం ఎలా వస్తుందోయ్ ?' అనేవాడు నవ్వుతూ.

బహుశా వారి ఆ స్వచ్ఛందమూ నిర్మలమూ అయిన ప్రేమాదరాలే తనను ఇంకో గది వెతుక్కోకుండా చేసి ఉండ వచ్చు. వాళ్లింటికి వెళ్ళాక గది సంగతే మరచిపోయాడు తను.

## 4

ఒకనాడు తను స్కూల్‌నించి వచ్చి విశ్రాంతిగా కూర్చున్నాడు మేడమీది నుంచి రాధతోపాటు ఇంకా ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి అప్పుడే కాలేజీనుంచి వచ్చినట్టుం దామె.

ఉతికిన బట్టల్ని మడతపెట్టి గదిలో పెట్టటానికి వచ్చిన రాఘవులు తననిచూసి 'ఎంతసేపైంది బాబూ వచ్చి ? తమరు రాగానే అమ్మాయిగారు చెప్పమన్నా రండి' అన్నాడు వినయపూర్వకంగా.

'పావుగంట అయింది రాఘవులూ !'' అన్నాడు తను.

'అలాగా బాబూ ! అమ్మాయిగారితో చెప్పి వస్తాను' అంటూ రాఘవులు వెళ్ళాడు.

కాస్సేపటికి రాధ స్నేహితురాళ్ళతో కిందికి దిగివచ్చింది. హాల్లోనుంచే తనని పిలుస్తూ 'టీ తాగారా మీరు ?' అని అడిగింది.

'లేదండీ!' అన్నాడతను గదిలోనుంచి బయటికి వచ్చి.

'రండి. టీ తాగి వెళ్దురుగాని......' అంది.

తను అంతమంది ఆడపిల్లల్లోకి బెరుగ్గా వెళ్ళి కూర్చున్నాడు. రాధ అందర్నీ కుర్చోమని ఒకసారి లోపలికి వెళ్ళి వచ్చింది.

'మీరు రాగానే చెప్పమని చెప్పాను రాఘవులికి మిమ్మల్ని చూడాలని వచ్చారు వీళ్ళు' అంది రాధ తనతో, స్నేహితురాళ్ళ నుద్దేశించి.

తను ఏదో జవాబు చెప్పే లోపలే 'అందరమూ కాదండీ. ఒక్క ఉషే మిమ్మల్ని చూడా లనుకొంటోంది' అన్నారు వాళ్ళు.

తను నవ్వాడు. 'బహుశా ఆవిడకు కూడా నన్ను ప్రత్యేకించి చూడా లనుకోవ టానికి కారణం కనిపించదు' అన్నాడు.

'ఎందుకు కనిపించదు ? మీ దగ్గఱ

ఆర్ట్ నేర్చుకోవా లనుకుంటున్నాను నేను!' అంది ఉష.

'ఇప్పుడే మీరు వేసిన బొమ్మ లన్నిటినీ చూపించాను వీళ్ళకు' అంది రాధ సౌమ్య స్వరంతో.

'అలాగా! ఆర్ట్ నేర్పటానికి నా కభ్యంతరంలేదు కాని, నేర్పితే వచ్చేదా కళ అని సందేహం!' అన్నాడు తను

'అయితే మీరు ఆర్ట్ స్కూల్లో టీచర్‌గా ఎందుకు పని చేస్తున్నారు?'— ఎదురు ప్రశ్న వేసింది ఉష.

'అదేముంది? అది ప్రొఫెసర్ బ్రతుకుతెరువు కోసం చేసే హంగామా!'

తనమాట మధ్యలో అందుకుని 'అలా అనకండి కళలు నేర్పితే వచ్చేవి కాక పోయినా, సంస్కరింప బడేవని మాత్రం మఱచి పోకూడదు అభిలాష గలవాళ్ళు మీ స్కూల్లో చేరుతున్నారుకాని నేను మిమ్మల్ని ఆర్ట్ నేర్పమని అడిగానా ఎప్పుడైనా?' అంది రాధ.

'అవుననుకోండి. అలా అభిలాష కలిగి చేరిన వాళ్లల్లోకూడా ఎందఱి కా విద్య పట్టు పడుతోందని నా ప్రశ్న!!'

తన మాటలకు ఉష ఏమనుకున్నదో, కొంచెం పౌరుషంగానే జవాబిచ్చింది.

'అందఱూ మీ అంత బాగావెయ్య లేక పోవచ్చును. కాని అభిలాషని ప్రోత్సహించటం గురువుల వంతు! మీ అంతవాడికిక మీరు నేర్పేదేమిట్కి?'అంది.



తను చాలా పెద్ద ఇదైన వాడని అనుకునే M L A. గారు ఒక హోటల్లో కెళ్ళి కూర్చోబోతూండగా, ఆయన ఎదురుగా ఉన్న ఆయన లేచి నుంచున్నాడు. M.L.A. గారు వెంటనే 'కూర్చోండి కూర్చోండి'. అన్నాడు.
"ఏం నన్ను ఆ బల్లమీదున్న పంచదార తీసుకోనివ్వరా?"

---

ఆమె మాటల్లోని పౌరుషానికి తను కొంచెం తగ్గాడు. నిజంగా తను ఎవరినీ బాధించాలని కాని, తనే గొప్ప ఆర్టిస్టునని కాని ఆ మాట అనలేదు. నిజానికి అంత మంది ఆడపిల్లల్లో కూర్చోవటం తనకు అలవాటులేని బొపోసన!! అందుకే మతి పోయి మాట్లాడాడు...

—రాఘవులు టీ సామాగ్రి బల్లమీద అమర్చుతున్నాడు వ్యగ్రమైన వాతావరణాన్ని ప్రపుల్లంగా మార్చేస్తూ 'ఇవాళ నిజమైన ఆర్టుకి ఇంకో లక్షణం కనిపిం

ఛింది మీ బొమ్మలు చూస్తుంటే!' అంది రాధ.

'ఏమిటి?' అని అడిగాడు తను.

మీ 'ఛాయా సీత' 'అన్వేషణ' 'సిద్ధార్థుడు' 'రంభాశుకులు' చిత్రాలకు మీరు కూర్చిన సాహిత్యం ఎంత గొప్పగా ఉందంటే—ఆ సాహిత్యం కూర్చిన కవులు తమ సాహిత్యంలో అంత గొప్ప అన్వయం ఉందని తెలుసుకోవటానికి గర్వపడతారు. మీ 'ఛాయాసీత' చిత్రానికి భవభూతి శ్లోకం రాసారు మీరు. 'ఉపాయానాం భావాత్—' అనే శ్లోకం. ఔనా?—' ఆగి తన వేపు చూసింది రాధ.

తను శ్రద్ధగా కుర్చీలో ముందుకు వంగి వింటున్న వాడల్లా తల ఊపి 'ఔను. చెప్పండి నేననుకోని, ఊహించని విశేషాలు ఏరుతున్నారు మీరు నా బొమ్మల్లో! చెప్పండి' అన్నాడు

రాధ ఒక్కక్షణం తనవేపు చూసి వెంటనే నవ్వింది.

'పుట్టుకతో కళ అబ్బిన వ్యక్తులంతా ఇంతే! వాళ్ళ కళలోని గొప్పతనం వాళ్ళకి తెలియదు తెలిసి చెప్పిన వాళ్ళని చూసి 'నిజంగానా?' అని విస్తుపోతారు సరే. వినండి. మీరు మీ చిత్రానికి రాసిన ఆ శ్లోకం ఉత్తరరామ చరిత్రలో ఒకప్పుడు సీతా వియోగం కలిగితే పరాక్రమంతో, శౌర్యంతో, ఉపాయంతో ఎలాగో ఆమెను తిరిగి పొందగలనన్న ఆశఉండేది నాకు. ఇప్పుడు నాఅంతట నేనే త్యజించిన ఆమె నెలా తేచ్చుకోగలను? ఇప్పటి సీతా వియోగం నాకు నిరవధికం, నిష్ప్రతిక్రియం అయిపోయిందికదా' అని రాముడు దుఃఖించే ఘట్టంలోది మీ చిత్రంచూసి, ఆ శ్లోకార్థం తెలిసి ఆలోచించే వాళ్ళకు ఆ సీతారాముల విధురబాధ, నైరాశ్యం అంతా తమదే అయి తాముకూడా అదేవిధమైన బాధతో కలిగి పోతారు. మీ చిత్రంతోనే కాదు—చిత్రానికి కూర్చిన సాహిత్యంలోని అర్థంతో మరింతగా దానిలో లీనమై పోయేట్లు చేస్తారు మీరు...' అంది రాధ.

తను, తనతోపాటు ఆమె మిత్ర బృందమూ రాధ చెప్పే మాటల్ని శ్రద్ధగా వింటున్నారు

రాఘవులు టీ సామగ్రి అంతా సిద్ధం చేసాడు. రాధ లేచి అందరికీ టీ కలుపుతూ మధ్యమధ్య ఆగి చెప్పసాగింది.

'ఇంక 'అన్వేషణ' తీసుకోండి భావుకత్వంకల ప్రతి వ్యక్తీ ఆ సాహిత్యంలోని అర్థానికి తప్పక ఆనందిస్తాడు. బాధితుడు శాంతిదేవతకై చేసే అన్వేషణ అది 'ఎడతెరపిలేని కన్నీటి జడుల దడిసి' అని ప్రారంభమైన ఆ పద్యం 'శాంతి దేవతా చరణ లాక్షారసారుణాంక లవలేశముల 'వెతుకాడుకొందు' అంటూ అంతమవుతుంది. కవి హృదయంలో చెందే వేసటకు రూపమిచ్చారు మీరు. అంటే కవి హృదయంలోని సుతిమెత్తని భావాలూ, చిత్ర లేఖకుడిలోని

సృజనశక్తీ రెండూ ఉన్నప్పుడు చిత్రకళ పరాకాష్ఠ నందుకుంటుం దనిపించింది నాకు ఆ చిత్రం చూస్తూఉంటే!' అంది రాధ టీ కప్పు తన కందించి

ఉష నవ్వి 'ఆ బొమ్మలు చూస్తున్నప్పుడు మాకెవరికీ తోచని ఈ విషయాలు నీ కెలా తట్టాయి రాధా?' అంది ఆమె పరిశీలనా శక్తిని మెచ్చుకుంటూ.

'అందుకే' జాన్సన్స్ ఆర్ రేర్, బట్ బాస్‌వెల్స్ ఆర్ రేరర్!' అనే సామెత ఏర్పడింది. ఊరికే రాలేదు' అన్నాడు తను టీ సిప్ చేస్తూ.

'పొగడుతున్నారు మీరు!' అంది రాధ టీ కప్పులోంచి నవ్వుతూ.

'లేదు లేదు. నిజంగా చిత్రకళలో ఇన్ని అందాలు, ఔన్నత్యాలు ఉన్నాయనీ, చూడవచ్చని ఇవాళే తెలుసుకుంటున్నాను. చెప్పండి ఇంకా! వినాలని ఉంది!' అన్నాడు తను స్వరంలో చాలా 'సిన్సియారిటీ' ధ్వనింప చేస్తూ.

'ఇంకా ఏం చెప్పను? నన్నిలా కదిలిస్తే ఇంక ఆపకుండా చెప్పేస్తాను. వినే ఓపికే మీకుండాలి...' అంది రాధ.

'చెప్పు రాధా! మళ్ళీ ఆ బొమ్మల్ని చూస్తాను తర్వాత చెప్పు' అంది ఉష

'రంభాశుకులు చిత్రం కూడా అంతే. దానికి విశ్వనాథ పద్యం కోట్ చేశారు మీరు. 'తను వాకచోట నుండియు సదా గతియుక్తుడవు—' అనే పద్యం ద్వంద్వార్థా లిమడి ఉన్న ఆ పద్యం శుకుడికి రంభ



"మన పనిమనిషిని రేపు తీసేస్తున్నా"
"ఏం? పని బాగానే చేస్తుందిగా."
"జ్యోతిష్కుడు మన ఇంట్లో ఉన్న పని మనిషిని తీసివేస్తే మీరు ఆఫీసు మానేసి ఇంట్లో పీరం వెయ్యటం తగ్గుతుం దన్నాడు."

ప్రార్థననేకాక, అతనిపట్ల చిత్రకారుడి అభినందనను కూడా స్పష్టీకరిస్తుంది. సాహిత్యంలో ఇంతటి బొమ్మకట్టును ఇమిడ్చిన కవితోపాటు, దాని కింతటి ఉత్తమోత్తమ చిత్రలేఖనం సిద్ధించటం— నిజంగా కళాకారుడెంత ధన్యుడో అనిపిస్తుంది!'

'బొమ్మ గీసి దానికోమాట కోట్ చేయటం గొప్పేమీకాదు రాధా! ఏముంది అందులో?' అంది ఒక అమ్మాయి.

'నిజంగా లేకపోవచ్చు. కాని పరాకాష్ఠ చెందిన చిత్రలేఖనాని కిటువంటి సాహి

త్యాన్వయం భావ ప్రకటనకు మరింత తోడ్పడుతుం దంటున్నాను. అందుకే ఇందాక అన్నాను కవి హృదయపు సుతిమెత్తని భావాలూ, చిత్రకారుడిలోని సృజనశక్తీ ఏకమైనచోట చిత్రలేఖనం పరాకాష్ఠ నందుకుంటుందని. అంతేకాదు. ఉత్తమ కళకి కీలకంకూడా ఒక్కటే! సమస్త కళాహృదయుడైన వ్యక్తి, తన అభిమాన కళలో నిజంగా మోక్షమే సాధిస్తాడు!' అంది రాధ.

అందరూ టీ తాగుతున్నారు మౌనంగా. రాధ కాసేపు ఏదో ఆలోచిస్తున్నట్లుండి, తర్వాత రాఘవుల్ని పిలిచి మేడమీద ఉన్న తన బొమ్మల్ని తెప్పించింది. అందులో 'సిద్ధార్థుడు' చిత్రం తీసి స్నేహితురాలికందిస్తూ 'చూడు దానికింద బన్‌యన్ కొటేషన్ చదువు' అని ఆగి, 'ఏమనిపిస్తోంది?' అని అడిగింది.

స్నేహితురాలు మౌనంగా ఆచిత్రాన్ని పక్కకి అందించింది

తను దానికింద 'First must give place to last, because last must have his time to come, but last gives place to nothing, for there is not another to succeed' అని పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్‌లో వాక్యాలు కోట్ చేసాడు.

స్నేహితురాలి సమాధానానికి నిరీక్షించి చూసి రాధ అన్నది. 'కళ ప్రధాన లక్ష్యం రంజింపచేయటం. ఈ చిత్రం నిజంగా మనసుని రంజింప చేస్తుంది అందరు రాకుమార్తెలూ ముందుగా సిద్ధార్థుడిదగ్గరకువచ్చి బహూకృతులై వెళ్లిపోతున్నారు. ఆఖరికి వచ్చింది యశోధర. అందరినీ సమాన భావంతో పరిగణించే సిద్ధార్థుడామెను రిక్తహస్తాలతో తిప్పి పంపలేడు. ఆమెకూడా లేక అర్థించటం లేదు. అది ఒక దైవఘటన! అతడు సిద్ధార్థుడు! ఆమె అర్థి! కానుకలా లేవు! తన కంఠహారంతో సిద్ధార్థుడామెను సత్కరిస్తున్నాడు. ఇక యశోధర సౌభాగ్యాన్ని హరించేందుకు వెనక ఎవరున్నారు? ఆఖరికి వచ్చినందుకు సిద్ధార్థుణ్ణే గెలుచుకుంది యశోధర ఈ చిత్రంలో సిద్ధార్థుడి ఔన్నత్యం, యశోధరమౌగ్ధ్యం చూడగానే మనల్నాకర్షిస్తాయి. ఈ కింద వాక్యాలు చదివినప్పుడు 'నిజంగా ఇది ఒక దైవఘటనే! లేకపోతే సిద్ధార్థుడు ఆ వచ్చినవారందర్నీ వివాహ మాడాడా? ఒక్క యశోధరకే ఆ భాగ్యం పట్టింది. సిద్ధార్థుడు భర్త కావటమంటే సామాన్యమా?' అనే ఆశ్చర్య సమన్వితమైన సంతృప్తి లభిస్తుంది మనసుకి. ఒక అలరించే ఊహ, ఒక మృదువైన భావం చక్కని కావ్యం చదివితే కలగవచ్చు. కాని చిత్రలేఖనంలో ఇంతటి రసమయత్వం సాధించటం కష్టం! అసలా రసమయత్వాన్ని గుర్తించేటంతటి శ్రద్ధ కూడా తక్కువే చాలామందికి అసలంత శ్రద్ధకూడా ఎవరికీ లేదు. ఈ చిత్రం,

ఈ సాహిత్యార్ధం యశోధరా సిద్ధార్ధులను, మహార్ధయుతమైన వారి కలయికలోని వైచిత్రిని అద్భుతంగా ఊహింపచేస్తుంది. చిత్రంలో ఔన్నత్యం లేనిది సాహిత్యాన్వయంవల్ల ఫలితం ఉండదనుకో కాని ఉత్తమ చిత్రానికిటువంటి అన్వయం రసస్ఫోరక మవుతుంది. అది ఈయన చిత్రాలలో బాగా స్పష్టమవుతోంది. అంటున్నాను నేను '' అంది రాధ స్నేహితురాలిని ఉద్దేశించి.

'కాని ఇదంతా నీ సూక్ష్మబుద్ధికీ, నిశిత పరిశీలనకూ నిదర్శనం. అంతేకాని నీవు ఆలోచించినంత ఆయన ఆలోచించనే లేదనుకుంటాను' అంటూ ఉష తనవేపు చూసింది.

'అందుకే నాకూ కొంత ఆశ్చర్యం కలుగుతోంది' అన్నాడతడు.

'ఆలోచిస్తే నేం ? లేకపోతే నేం ? ఇదంతా ఆయన చిత్రాలలో ప్రస్ఫుటమయేదే!—' అంది రాధ.

తను రాధవేపు చూస్తూ ఆమె మాటలు వింటున్నాడు. కేవలం ఒక్క వాక్యమే మాట్లాడిం దామె కాని ఆమె మాటల్ని వినే ఉద్దేశంతోనే ఆమెవేపు చూసిన తనలో తన ఎరుకలేకుండా ప్రవేశమైన ఒకానొక భావ వికారానికి విస్తుపోయాడు. ఆ భావం తనకు నూతనం అందుకే యుక్తాయుక్తాలకంటే ముందు మాధుర్యం అధికంగా తోస్తోంది.




"ఏమేవ్! నంజుకోవడానికి ఏమీ చేయకపోతే పోయింది. నువ్వు చేశావు చూడు. మైసూరుపాకం దాన్నిలా పత్రా-పుల్లింగా. కారంగా నంజుకోవడానికి సరిపోద్ది."

---

ఆశ్చర్యపోయాడు తనలో తానే!! ఇంతవరకూ రాధను చూస్తున్నా, ఆమెతో మాట్లాడుతున్నా తనలో ఎటువంటి వికారమూ కలగలేదు ఇప్పుడీ చిత్రసమీక్ష ప్రారంభంలోనూ మనసెటువంటి దౌర్బల్యానికీ లోనై ఉండలేదు. ఈ భావం కేవలం అనూహ్యమూ, ఆకస్మికమూను '!

అతి సహజంగా, కళాభిరుచే ప్రధానంగా ఇంకా ఏదో మాట్లాడుతోంది రాధ.

తన మనసులో ఇటువంటి భావం కలగ కూడదు. శక్తి కూడగట్టుకుని మనసుని గదమాయించి అణచివేయబోయాడు. కాని వినూత్నమైన ఆ భావంలోని తీపులు హృదయాన్ని పరవశం చేస్తున్నాయి. తన భావం ఆమెకు తెలియకూడదు. బల వంతాన చూపుల్ని, టేబిల్ మీది చిత్రాల వేపుకి మరల్చాడు.

'అన్వేషణ' చిత్రం కంటపడింది.

'శాంతిదేవతాచరణ లాక్షరసారు

ణాంక లవలేశముల వెతుకాడు

కొందు,—'

హృదయంలో ఆ పద్యపాదం మార్మ్రోగుతోంది. మళ్లీ రాధ వేపు చూసాడు. భుజం మీదుగా పమిట కప్పు కుని ఎవరో అన్నమాటకు నవ్వుతోం దామె! ఎంత నిండుగా నవ్వుతుంది!! ఇప్పుడింత మందిలోనూ రాధలా తన నాకర్షించేవా ళ్ళెవరూ లేరనిపించింది ఉష అంటే ఆమెలో కేవలం విద్యవల్ల ఏర్పడిన సంస్కారం మాత్రమే గోచరి స్తోంది. కాని రాధ అలాకాదు. సహజంగా హృదయ పరిపాకం ముఖంలో ఒక వింత కాంతి కలిగిస్తోంది. నిండైన ఆమె నవ్వు పౌర్ణమినాటి సముద్రుని నవ్వు!!

'ఏమిటండీ ఆలోచిస్తున్నారు? టీ పాట్ ఖాళీ కాలేదింకా!' అంది రాధ నవ్వుతూ తనతో.

'అవునవును. మఱిచి పోయాను.' అంటూ టీ కప్పులో పోసుకున్నాడు.

'వెళ్తాం రాధా! చలా సేపైంది వచ్చి' అంటూ స్నేహితురాళ్లు సెలవు తీసు కుంటున్నారు

'మీ రింతకూ నాకు ఆర్ట్ నేర్పుతారా?' అని అడుగుతోంది ఉష.

'తప్పకుండా ఆ అభిరుచే ఉండాలి కాని అంతకంటేనా?' అంటున్నాడు తను......

వాళ్ళు వెళ్ళిపోతున్నారు. రాధ గేటు వఱకు వాళ్లననుసరిస్తోంది. తను అన్య మనస్కుడై కూర్చున్నా డలాగే!!

* * *

కొందఱు వ్యక్తులకు వయసుతో పాటు వాసన లభివృద్ధి చెందవు. ఎంత వయసు వచ్చినా అవి ఇంకా నిద్రాణ మయే ఉంటాయి పాతికేళ్ల యౌవనం లోనూ, బాల్యత్వమే వెన్నాడుతూ ఉంటుంది వారి హృదయాలను! కాని ఏ క్షణాన్నో అవి కొట్టి లేపినట్లుగా మేల్కొంటాయి. అప్పుడిక వాటి విజృంభణ నాపటం దుస్సాధ్యం.

తన పనీ అంతే అయింది. తన జీవితం ఇంతవఱకూ ఒక స్వాప్నిక జగత్తులోంచి నడిచింది. తన మనసుకీ, ఆ జగత్తుకీ అవినాభావ సంబంధం ఉండేది. మనసునూ, ఆ జగత్తునూ వేఱు చేసి చూడలేకపోయేవా డింతవఱకూ. అలా చూసుకోవాలనీ తోచలేదు. యౌవన ప్రాదుర్భావంలో కూడా, బాల్యస్ఫురణే, ఆ అమాయకత్వమే ప్రతిబింబించింది

తనలో. స్త్రీలూ, మధురభావాలూ తనకు పూర్తిగా నూతనం. వాస్తవికమైన ఈ అనుభవానికి వ్యవధి ఏది తనకు ? దృశ్య ప్రపంచమంతా అంతర ప్రపంచంలో ప్రతిఫలించి, సౌందర్యం రాశీభూతమైన నట్లు తోచే ఈ ప్రపంచం తన కళ కాధారంగా తప్ప, ఆశ్రయంగా ఎన్నడూ భావించలేదు తను తన హృదయమే తనకు ఆశ్రయం.

కాని, ఇదేమిటి ? ఒక్కసారి అంతా తల క్రిందులైనట్టుగా, అశాంతిగా, కల్లోలంగా ఉందిమనసు!హృదయాంతరాళాల్లో వెఱ్ఱిగా, ఊహకి అందకుండా సంచరించే కోరికలన్నీ ఈనా డొక్కొక్కటీ బుద్ధికి చేరవేయబడు తున్నాయి. మనోజ్ఞ స్వాప్నిక జగత్తు కొంచెం కొంచెంగా దూరమూ,అస్పష్టమూ అవుతున్నట్లుంది.

—అతనికి భయంవేసింది. తన కలలు చెఱిగి పోకూడదు. తన లోకాన్ని గట్టిగా కావిలించుకున్నాడు హృదయంతోనే!! కాని వెనువెంటనే యౌవనం, లోకం, స్త్రీ తలపుకి వచ్చి ఆ అనుభవం కోసం హృదయం వెఱ్ఱిగా అఱ్ఱులు చాచింది!!

అతనికి నిద్రలేదు. రాత్రులకు రాత్రులు రాధను గుఱించి తలపోస్తూ గడిపాడు.

'ఈ ప్రేమ ప్రవాహాన్ని, ఈ మధుర భావనా వేగాన్ని, ఈ వేడిని ఎలా తట్టుకోను ?' అని వగచాడు. గత్యంతరం తోచలేదు.

—ఆనాడు టీ టేబుల్ ముందు కూర్చుని రావు ఏదో చెబుతూనే ఉన్నాడు. తనకు వినాలని లేదు. అన్య మనస్కుడై ఆలోచిస్తున్నాడు తన ఉదాసీనత గుర్తించి, సంభాషణకు స్వస్తిచెప్పి పని ఉందంటూ వెళ్ళిపోయాడు రావు.

తన మనసు తెరిపిన పడినట్లయింది. విశ్రాంతిగా ఆలోచించుకో సాగాడు.

రాధ స్నానంచేసి పైకి వెళ్ళింది...

తను ఉద్వేగపడిపో సాగాడు...

రాధ కాలేజీకి వెళ్ళటానికి సంసిద్ధురాలవుతోంది...

తనింక నిగ్రహించుకో లేననుకుంటున్నాడు...

బట్టలు మార్చుకుని కిందికి వచ్చింది రాధ...

తను మెల్లిగా లేచాడు. రాధ ఏవో పుస్తకాలు వెతుకుతోంది.

తను గదిదగ్గఱకు వెళ్ళి ఆమెను పిల్చాడు మంద స్వరంతో.

రాధ తలతిప్పి చూసి 'పిల్చారా? రండి' అంది ప్రసన్నంగా.

'ఒక్కసారి మీరే ఇటు రండి' అంటూ తన గదిలోకి దారితీసాడు తను.

రాధ తన ననుసరించి వచ్చింది.

'ఏమిటి?' అంది నవ్వుతూ.

చక్కని ఆమె నవ్వు మళ్ళీ తనను వెఱ్ఱెత్తించింది. తనలో జనించిన రాగం వల్ల కాదు. నిజంగానే ఆమెలో ఏదో వెలుగుంది. అదే తననింత ఆకర్షిస్తోంది.

తను సమాధానంగా 'చూడండి ఇది!' అంటూ ఒక చిత్రం అందించా డామెకు.

రాధ తీసుకుంది

ఒక నది నదిలో నావ. ఇవతలి తీరాన ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని చేతిలో ఒక పువ్వు ఉంది. ఆ పువ్వు ఆకారంలో అవతలి తీరాన ఒక స్త్రీ నిలబడి ఉంది. ఆమె నిశ్చలంగా ఉంది. వాతావరణం ప్రశాంతంగా హాయిగా ఉంది. కాని అతని ముఖంలో ఏదో భావాలు చెదరి చెదరి అల్లుకుంటు న్నాయి.

రాధ ఆ చిత్రాన్ని చాలా సేపు చూసి, దానికింద రాసింది చదవసాగింది

*I that have love and no more*
*give you but love of you Sweet,*
*he that hath more let him give,*
*he that hath wings let him Soar,*
*mine is the heart at your feet,*
*here, that must love you to live!'*

**—Swinburne.**

యధాలాపంగా పైకిచదువుతున్న రాధ కంఠస్వరం దానంతటదే తగ్గిపోతోంది క్రమంగా. చివరి వాక్యాలను లోలోపలే గొణుక్కున్నది.

తనామె ముఖకవళికలను జాగ్రత్తగా ఆత్రంగా పరిశీలిస్తున్నాడు

తలవంచుకుని క్షణకాలం మౌనంగా నిలబడింది రాధ. తర్వాత వెంటనే 'బావుంది!' అంటూ చిత్రాన్ని టేబిల్ మీద పెట్టేసింది.

తన భావా న్నర్థం చేసుకుందా ఆమె? చేసుకుందనే అనిపించింది తనకు. కాని ఆమె మాట్లాడలేదు. తలవంచుకుని అలాగే నిలబడింది. తన వేపు చూడ టానికీ, తన చూపుల నెదుర్కోవటానికీ ఆమె సిద్ధంగా లేదనిపించిది సహజంగా ఉండటానికి ప్రయత్నంచేసి విఫలురాలై పోయింది. కళ్ళు వాటంతటవే వాలి పోయాయి......

తను 'బావుంది!' అన్న ప్రశంసను మించినదాని కెదురు చూస్తున్నాడు. ఆమె మాట్లాడదు. తను అడగలేడు గుండెలు ఉద్వేగంతో కొట్టుకొంటున్నాయి

నిశ్శబ్దం ఆవరించిం దిరువురి మధ్యా ఇద్దరూ మౌనంగా నిలబడి ఉన్నారు. తనేదో అనాలను కున్నాడు. ఆమె తలెత్తింది.

'రాధా!' అంటూ ముందు కడుగు పెట్టాడు తను

రాధ విశాల నేత్రాలు బరువుగా చూసాయి క్షణమాత్రం తక్షణమే తొట్రుపాటుతో 'వస్తాను!' అంటూ గబగబా వెళ్ళిపోయిం దామె

కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి తనకు. కన్నీటి తెరలలో మసక గప్పిన తన దృష్టి నామె పమిటకొంగు అందంగా, ఏదో సందేశాన్నిచ్చి ఇవ్వనట్లు తాకి అంతలోనే మాయమైపోయింది.

అలాగే ప్రమాన్పడి నుంచున్నాడు తను!

## 5

ప్రేమ హృదయాన్నావరించిన ప్రథమ దశలో తనలో తను ఎంత బాధపడినా ఇతరుల సమక్షంలో నేరస్థుడు కావలసిన అగత్యం లేకపోయింది. పైగా ఆ బాధ ఎంతో మధురంగా కూడా ఉండేది కాని ఇప్పుడు రావు ఎదుటకూడా తను నేరస్థుడిలా బాధ పడుతున్నాడు. ఇక రాధమాట సరేసరి! తను చేసినపని ఆమెకు కోపం తెప్పించిందేమో నని. తన హద్దులలో తాను నిలవలేని వాడిగా భావిస్తోందేమో నని, ఆమెకు ఎక్కడ కనిపించి పోతానో అని తప్పించుకు తిరుగు తున్నాడు!

కాని రాధ హృదయం తెలుసుకోవాలని తను ఎంతగా కోరుకున్నాడు? ఆ చిత్రాన్నర్థం చేసుకోలేని ముగ్ధా రాధ? కాదు. కాని ఎందువల్లనో తన ప్రేమ నాపేస్తూ వెళ్ళిపోయింది. చూపులతోనే తనని ముందుకి రాకుండా కట్టేసింది ఆ చూపులు, ఆ తేజస్సు, ఆ సౌందర్యం మనసుల్ని మత్తెక్కించే ఆ మనిషా కాదు హృదయ బాధలన్నీ నివేదించుకుంటే భరించగల, లాలించగల, ప్రేమించగల శాంతి సుఖాశ్రయమైన పరమమైన సౌందర్యం ఆమెది! ఆమె సౌందర్యం స్త్రీ జన్యమైన మాతృత్వానికి నెలవు! సృష్టికి హేతుభూతమైన పరమ పవిత్ర సాహచర్యానికి సూచన! కాని ఆమె తనకందు తుందన్న ఆశ లేదు. తనకు!!

ప్రకటించిన ప్రేమకు ఫలితం కనిపించకపోగా, మునుపటిలా కాకుండా, మౌనంగా, గంభీరంగా ఉంటోంది రాధ ఆ యింట్లో ఇప్పుడు క్షణంకూడా శాంతంగా గడపలేక పోతున్నాడు తను!'

ఒకనాడు టీ తీసుకుంటున్నారు తనూ, రావూ, రాధా. మాటల సందర్భంలో అన్నాడు తను.

'రూమ్ దొరికిందండి! వెళ్తాను' అని.

తల వంచుకుని టీ కలుపుతున్న రాధ హఠాత్తుగా తలెత్తి చూసింది తన వేపు! ఆనాటి కిదే మళ్ళీ తనవేపు చూడటం' కాని తను అది గమనించనట్లు రావు వేపు తిరిగాడు.

'ఏమిటీ?' అయితే నువ్వెంత మంచి వాడివో, అంత మొండి వాడివి కూడా గోపాల్! రూమ్ వెతకవద్దని చెప్పలేదూ నేను?' అన్నాడు రావు.

తను శుష్కంగా నవ్వి ఊరుకున్నాడు. కాని ఎంత బాధ పడుతున్నాడు లోలోపల? అవకాశమిస్తే గట్టిగా ఏడవాలనికూడా ఉంది తనకు

'ఇన్నాళ్ళు మీ యింట్లో సర్వ స్వతంత్రంగా గడిపాను ఇంకా ఎన్ని రోజులుండను? ఏమీ అనుకోకండి మీరు. సాయంకాలం వెళ్తాను అన్నాడు

'అది కాదు గోపాల్? నువ్వింకో రూమ్ వెతుక్కోవలసిన అగత్యం ఏముందిప్పుడు? మాకు ఇల్లు చాల దంటావా? ఇంకా పదిమంది వచ్చినా ఇబ్బందిలేని ఇల్లు! అలాంటప్పుడు నువ్వింకో రూమ్ వెతుక్కున్నావంటే నీ కిక్కడ బాగాలేదన్నమాటే' ఏం రాధా?' అన్నాడు రావు. (సశేషం)



# రాధికాస్వామి

(గతసంచిక తరువాయి)

ప్రతిమాదేవి

'లేదు, లేదు అలా అనుకోకండి నాకీ ప్రపంచంలో ఎక్కడైనా బాగుంటుందంటే అది ఇక్కడే అని నిశ్చయంగా చెప్పగలను' మీరు నాకు పరమమిత్రులు. కాని.. ' అతి ఆప్యాయంగా మాట్లాడబోయాడు అయితే అంతకంతకూ కంఠం ఎవరో అదిమి పట్టుకున్నట్లుగా పూడుకుపోతోంది

'నాన్నా! టీ తీసుకో!' అంది రాధ గంభీరంగా

తనకూ టీ కలిపి చాలా మెల్లగా' తీసుకోండి' అంది కప్పు ముందుపెడుతూ

ఆమె ఈ నిర్హేతుక గాంభీర్యాని కర్ధమేమిటో ఊహించలేని రావు రాధవేపు చూచి మాట్లాడకుండా టీ తాగటం మొదలుపెట్టాడు.

కప్పు కిందపెడుతూ 'నువ్వువెళ్ళటం నా కిష్టంలేదు గోపాల్ ' రాధకీ అంతే నీ యిష్టం తర్వాత !' అన్నాడు రావు

టీ తాగి రాధ వెళ్ళిపోతోంది దుఃఖం తీగెలు సాగుతోంది తన కంఠంలో కాని రావు ధోరణి మామూలే '

'చూడు' నువ్వు వెళ్తానంటే రాధ కెంత కోపం వచ్చిందో !' అంటున్నాడాయనే !'

* * *



రావుగా రింట్లోంచి ఒక ఫ్రెండ్ రూమ్‌లోకి మారాడు తను రూమ్ దొరికిందని రావుతో అబద్ధం చెప్పాడు

కాని ఏదో బాధగానే ఉంది తనకు తానై తెచ్చిపెట్టుకున్న ఆ పరిస్థితిలో, రాధ మౌనం తన కవమానంగా తోచింది అసలే ఆమెనలా అర్థించటం నేరమేమో అనే బాధతో క్రుంగిపోతున్నాడేమో, ఆమె తన కే విధమైన సమాధానమూ ఇవ్వకపోవటంతో ఇంకా నేరస్థుడిలా బాధపడిపోయాడు తను ఏంచేయాలో, ఆమెతో ఇంకేమనాలో — ఏమీ అనకుండానే ఊరుకోవాలో ఏదీ తోచని సందిగ్ధావస్థలో కటకటలాడిపోయాడు అక్కడ ఇంక ఉండలేననుకున్నాడు కాని ఇక్కడ కూడా ఉండలేక పోతున్నాడు తనకు రాధ కావాలి. ఎలా వస్తుంది ? ఏవిధంగా ఆమెను గెలుచుకుంటాడు ? ఆమె మౌనాని కేమని అర్థం చెప్పుకుంటాడు ? ఇప్పటికీ తనకు తెలియకుండా, అజ్ఞాతంగా ఉండిపోయిన మహా విషయాలలో స్త్రీ హృదయ మొకటి

ఆ నిండుతనంలో, ఆ నిర్మలత్వంలో, ఆ తేటనవ్వుల్లో, రాధలో స్త్రీ సహజమైన లజ్జాభరత్వం కూడా ఇమిడి ఉంటుందని తనకేం తెలుసు? స్త్రీ హృదయ పరిజ్ఞానానికై మనసు కే భావపరిపోషణ నిచ్చాడు కనుక స్త్రీ నైజం తనకు వంటబట్టిందనుకుంటాడు ?

రూమ్ దొరికిందని చెప్పినప్పుడామె విశాల నేత్రాంచలాల నిలచిన బాష్ప సందోహం తనకు పిలుపుగా గ్రహించలేక పోయాడు · అసలు రాధ తన కంటబడితేనా ఆ తర్వాత ?

కాని క్రమంగా తను మారిపోయాడు రాధాదేవి దివ్య సౌందర్యం తనలోని వాంఛలను మేల్కొల్పింది. అది ఆమె ప్రయత్నపూర్వకంగా చేసిన పని కాదు. ఆమె సౌందర్యాన్ని అప్పటి తన హృదయం గ్రహించిన తీరు అది అస లిటువంటి విషయాలలో ఆమె మనసెటువంటిదో తనకు తెలియదు కాని 'సిద్ధార్థుడి వంటి భర్త లభించటం సామాన్యమా ?' అని రాధ చెబుతూ ఉంటే ఆమె హృదయం తన కవగతమైందనుకున్నాడు తను ఆమెకు సిద్ధార్థుడు కాకపోవచ్చు. కాని ఆమె తనకు యశోధర ! అయితే యశోధర సిద్ధార్థుడికి చివరకు లభించింది ! తనకు మొదట వచ్చి మాయమైపోయింది !!

రాధ మీది ప్రేమ భగ్నమైపోయింది. తన హృదయం ఉద్వేగభరిత మౌతోంది తనకు తోడుకావాలి తోడనుకున్న రాధ దూరమైపోయింది రావుగారింటికి వెళ్లటమంటే ఏదో నేరంచేసినట్లుగా బాధపడుతున్నాడు తను. అక్కడికి వెళ్లలేదు. ప్రేమ నాపుకోలేదు

ఈ మానసి కావస్థలో తను ఎన్నెన్ని ప్రణయ చిత్రాలు గీసాడు ? రూపం

లోనూ, ప్రవర్తనలోనూ కూడా పిచ్చి వాడిలా తయారయ్యాడు

తన ప్రేమ స్నేహితుడికి పరిహాస పాత్రంగా కనిపించింది అతను అడుగడుగునా తనను ఆటలు పట్టించేవాడు తన బాధ మఱింత దుర్భరమయిననాడు కూర్చుని ఏదో వేదాంతం చెప్పేవాడు

'ఒక్క భంగపాటు భరించలేని నువ్వు జీవితం ఎలా గడుపుతావు గోపాల్? ధైర్యంగా ఉండాలోయ్' రాధ కాకపోతే మరొకరు' లోకం గొడ్డుపోయిందా?' అనేవాడు

పైగా తన తత్వాన్ని ఆశావాదం అనేవాడు 'అందినంత వరకూ ఆనందాన్ని జూరుకోవడమే పరమార్థం గతించిన వాటికి విచారించే అవకాశం లేదోయ్! కాలం వేగంగా గతిస్తోంది. కాలుడి కరాళదంష్ట్రిలు భయంకరంగా మనల్ని గ్రహించబోతున్నాయి బతికి నన్నాళ్ళూ సుఖపడదాం లేనిదానికి విచార మెందుకు? ఆనందో బ్రహ్మ అన్నారోయ్!' అనేవాడు

అది తనకు ప్రేమ అంకురించిన ప్రథమ దశ రాధను స్త్రీ కంటే అధికంగా పరిగణించలేకపోయేవా డప్పుడు అలాంటి మానసికావ్యవస్థలో సుఖానికి స్నేహితుడి నిర్వచనం తనపై అధిక ప్రభావాన్ని ముద్రించింది తనలో భౌతిక సుఖవిషయికమైన తర్కం బయలు దేరింది



"షీలాదేవీ! మీరు త్వరగా టైప్‌రైటరు తీసుకొని ప్రక్క గదిలోకి పోండి. నా భార్య నన్ను చూట్టానికి వస్తున్నది."

'తరుణము మించిపోయిన వృథా యయిపోవు నిరీక్షయెల్ల' తనకూ తరుణం మించి పోతే తారుణ్యపు సౌఖ్యాలు గగనకుసుమాలై పోతాయి త్వరపడాలి అందని రాధకోసం ఎందుకీ ఆవేదన?

తను రావుగారింటికి వెళ్లటం మానేసాడు. రావు రెండు మూడుసార్లు ఫోను చేసాడు రమ్మని తను ఎప్పటికప్పుడు వెళ్దామనుకుంటూనే వెళ్లలేకపోయాడు.

'వెళ్లవోయ్' తన స్వామికి స్వాగతం చెబుతుంది రాధ! ఆడవాళ్లంతా మొదట్లో అలాగే ఉంటార్లే' కొంచెం సాధనచేస్తే దారికివస్తారు! వెళ్ళి హాయిగా సాగినన్నాళ్ళు ప్రణయం సాగించు సరసం విరసమవుతే చల్లగా అక్కడి నుంచి జారుకో! అంతే' సుఖపడటమూ చేతకావాలోయ్ స్వామీ' రాధికాస్వామీ!' అన్నాడు స్నేహితుడు

అత నెప్పుడూ తనను పరిహాసానికి అలాగే పిల్చేవాడు అతనెంత పరిహా

సంగా తన వేదాంతమంతా నూరిపోసినా ఎందుకో రాధని గురించి అతనలా మాట్లాడుతూ ఉంటే వినలేకపోయేడు తను అతని మాటలు తననేరాన్ని అధికం చేస్తున్నట్లు బాధపడి అసలే రాధ ఎదుట పడలేక పోయాడు అందుకే మళ్ళీ రావు గారింటికి వెళ్ళలేదు తను.

## 6

'ఆనందో బ్రహ్మ'' అన్నదానికి స్నేహితుడిచ్చిన విపరీతపు వ్యాఖ్యానాన్ని తానెంత చీదరించుకుంటున్నా ననుకున్నాడో—అంతగా దాని ప్రభావానికి లొంగిపోయాడు అప్పటినుంచీ తను మారిపోయాడు తనలో శక్తులు విజృంభించాయి విశృంఖలవృత్తి నవలంబించాడు

కళాత్మక దృష్టి కాత్మ నిగ్రహం తోడైనప్పుడు కళ ఉద్బోధకమూ, జ్ఞాన సాధకమూ అవుతుంది కాని కళాభిజ్ఞతకు వ్యాలోలత సిద్ధించినప్పుడు విశృంఖల వృత్తిలో కాని కళాకారుడు జీవించ లేడు! అప్పు డతని కళ అవుతే నిలచి ఉంటుంది కాని, వ్యక్తి మరణిస్తాడు కళ, కళాకారుడూ కూడా అజరామరంగా వెలగాలంటే, అభిజ్ఞతా, ఆత్మ నిగ్రహమూ రెండూ తోడుకావాలి!

కాని, వ్యక్తిగతంగా తను పూర్తిగా దిగజారిపోయాడు కళాపరంగా ఉన్నతుడయాడు పాతికేళ్ళ వరకూ తన జీవితం లౌకిక వాసన లెరుగని అతి అమాయకమైన బాల్యత్వంలో నడిచింది అయినా ఏ పూర్వపుణ్య ప్రాభవమో తన హృదయంలో స్వచ్ఛంద కళాంకురం మొలకలెత్తించింది ఇంచుమించు పాతికేళ్ళవఱకూ లోకమంటే ఏమిటో, శరీరావసరాలంటే ఏమిటో ఎరుగకుండా బ్రతికాడు తను

కాని రాధ తన కళాత్మక హృదయ పుటాలను వెనక్కి నెట్టి అట్టడుగున మసలుతున్న ప్రేమను పురికొల్పింది కాని దానికి కట్టలు నిర్మించలేక పోయింది అందుకే తన ప్రేమ అనుభవంతో కాని తృప్తి చెందని సామాన్య స్థితికి వచ్చేసింది

రాధకు ముందు తన కనుభవం లేదు రాధతో ప్రేమ కలిగింది కాని అనుభవం మాత్రం కలగలేదు అందుకే ఆమెను పోగొట్టుకున్నాడు తను! హృదంతర్గత ప్రేమోద్వేగాన్ని సహజంగా, అంత సులభంగా స్త్రీలు బహిర్గతం చేయలేరన్న విషయం తనకేం తెలుసు? తను వెళ్ళి పోతానంటే వ్యగ్రభావంతో కూర్చున్న రాధకు, అది తన అసభ్య ప్రవర్తనకు కోపమనుకున్నాడు కాని, తను వెళ్ళటాని కనంగీకారమని తెలుసుకోలేక పోయాడు

ఏమైనప్పటికీ తను మారిపోయాడు కేవలం ఆకస్మికంగా తనలో మేల్కొన్న

వాంచలు ఆపరాని మాధుర్యంతో తనను కట్టివేసాయి సామాన్య దృష్టిలో సుఖ మంటే ఏమిటో, ఆనందమంటే ఏదో— అవన్నీ రెండుచేతులా ఆస్వాదించాడు

తనను గురించి లోకం పరిపరి విధాల అనుకునేది

'గొప్ప చిత్రకారుడనే కాని ఒర్రి పాడుమనిషి'

'బొమ్మలు మాత్రం అద్భుతంగా, సామాన్యులుకూడా చిత్ర లేఖనమంటే ఆసక్తి చూపేటంత గొప్పగా గీస్తాడు ఏం లాభం?'

'అతన్నిగురించి మన కనవసరమే ననుకోండి మనిషి మంచివాడు కాదం టారు'

'స్త్రీ లేనిచోట అతను మర్యాదస్తుడు'

—ఇవీ తనను గురించి ప్రజల అభి ప్రాయాలు తనుమాత్రం వాళ్ళమాట లెన్నెప్పుడూ చెవి సోకనీయలేదు వామన మూర్తి ఈ విషయమై బుద్ధులు గరపుతూ ఎన్నో ఉత్తరాలు రాసాడు కూడా కాని తనకు లక్ష్యంలేదు

ఈ పర్ణకుటీరం, ఈ జీవితం ప్రారంభించకమునుపు తన చిత్రాలుచూసి తనను వ్యక్తిగతంగా కలుసుకోవాలని ఒక లేడీ స్టూడెంటు అన్నను అడిగిందిట కాని అతను ఒప్పుకోలేదు ఆగలేక ఆ అమ్మాయి తనకు ఫోన్ చేసింది

'మీ చిత్రాలు చూస్తుంటే మన ఆంధ్రులలో ఇటువంటి చిత్రకారు



"మీకు తెలియదు అదిసరిగా ఫిట్ అయింది"

డున్నాడుకదా అని చాలా గర్వంగా ఉంటుంది'' అన్నది.

తను నవ్వాడు, ఫోన్‌లోనే.

'మిమ్మల్ని పర్సనల్‌గా మీట్ అవాలనుకున్నాను కాని మా అన్నయ్య ఒప్పుకోలేదు మీ వ్యక్తిగత జీవిత మంత మంచిదికాదుట''

ధన్యోస్మి' మనసులో బాధ సూటిగా బయటపెట్టింది''

'నేను మిమ్మల్నేమీ చేయనులెండి' అన్నాడు నవ్వుతూ

ఆ పిల్లకూడా నవ్వేసింది ఎవ్వరో, ఏమీ దాచుకోలేని ఒర్రి బోళాపిల్లలా ఉంది''

అరగంటసేపు తనని గురించి ఏమిటో ప్రశంసించి పారేసిందామె అంత ఓపిగ్గా విన్నాడు తను

ఫోను పెట్టేముందు 'నేను మంచి వాడ్నని మీకైనా అనిపించటంలేదా?' అని అడిగాడు పరిహాసానికే

'నాకా? నా కనిపిస్తోంది కళాకారులు విశృంఖలంగా సంచరించినా, ఎప్పటికైనా వాళ్ళు సత్యం రియలైజ్ చేయ

గలుగుతారనే నా దృఢవిశ్వాసం అందువల్ల ఉత్తమ కళాకారుల లోపాలు నాకు కళంకా లనిపించవు '' అంది

ఎంత బాగా చెప్పింది! ఎం బి చదువు తోందిట బాగా పైకి వస్తుందనుకున్నాడు తను

కాని తన ప్రస్తుత పరిస్థితినిబట్టిచూస్తే ఆమె చెప్పింది నిజమే ననిపిస్తోంది ఎప్పటికైనా రియలైజేషన్ రావాలి తప్పదు కళాకారులకే కాదు, ఎవరికైనా అంతే''!

# 7

రాధతో పరిచయం కాలంతో పాటు విస్మృతి చెందుతోంది తను ఎంత విశృంఖలంగా తిరుగుతున్నా, చిత్రలేఖ నాసక్తి మాత్రం చచ్చిపోలేదు అది ఒక్కటే తనలో ఈ మాత్రమైనా ఔన్నత్యం కలిగించింది. లేకపోతే తనెందుకూ కొరగానివాడై పోయేవాడు

అఖిలభారత చిత్రకళా ప్రదర్శనలో తన చిత్రాలకు ప్రథమ బహుమతి వచ్చింది. ఐదారేళ్ళ తర్వాత కొందఱు కళాకారులతో పాటు పారిస్ వెళ్లటం తటస్థించింది అక్కడ కూడా తన చిత్రాలెంతో ప్రశంసించబడ్డాయి తర్వాత కలకత్తాలో కొన్నాళ్ళు ఉద్యోగం చేసి, అక్కడి నుంచి మెద్రాస్ ఆర్ట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వచ్చేసాడు మొత్తం మీద తనంటే ఎరుగని వాళ్లు లేరు దేశంలో! తన కళకు రాజుల ప్రాపకం సైతం లభించింది

కీర్తి కాంత కలకలంలో రాధ చాలా వరకు విస్మృతిలో పడిపోయింది కాని అప్పుడప్పుడు స్నేహితుడు పరిహాసానికి పిల్చే 'రాధికాస్వామి' పేరు తలపుకి వచ్చి, తన హృదయం రాధచుట్టూ పరిభ్రమించి, ఆ ఆలోచనలతో పరితప్తం కావటం మాత్రం తప్పటం లేదు 'రాధికాస్వామి' అనే ఆ పేరుని గురించి తనపై ప్రజలలో వివిధ ప్రచారా లున్నాయి కూడాను ''

తను అప్పుడు మెద్రాస్‌లో ఉంటున్నాడు

'నా దీవన ఫలించి పైకి వచ్చావు ' అత్తయ్యా, మామయ్యా పోయినా వారి పేరు నిలబెట్టావు. రక్తస్పర్శగల బంధువులం మమ్మల్ని మరచిపోకు ఒకసారి వచ్చి చూసి వెళ్ళు' అని రాసిందొకసారి అత్తకూతురు సీత అయిదుగురు పిల్లల తల్లి ''

సీత ఉత్తరం చూడగానే చిన్ననాటి పల్లె జీవితమంతా కళ్లకు కట్టినట్లయింది

'ఈ ఉచ్ఛస్థితిలో 'ఒక్కసారి ఆ గ్రామీణ ప్రాంతాలకు వెళ్తే బాగుంటుంది' అనుకున్నాడు

అనుకోవటమే తడవుగా బయలుదేరాడు

— వేగంగా పోతుంది కారు చెట్లూ, పుట్టలూ ఒకదాని తర్వాత మరొకటి

త్వరత్వరగా వెనక్కి మరలిపోతున్నాయి. కారు చప్పుడు మాత్రం విడవకుండా వినిపిస్తోంది తను బయటికి చూస్తూ కూర్చున్నాడు . . ..

ఈ చెట్లూ, పుట్టలూ వెనక్కి మరలిపోతున్నట్లే తన జీవితంలో సంవత్సరాలు దొర్లిపోయినాయి కాని ఈ నీలాకాశం లాగానే అంతర్యంలో ఏదో ఆవేదన ఇన్నాళ్ళనుంచీ తనను వెన్నాడుతూనే ఉంది స్నేహితుడు చెప్పిన సుఖం నిజంగా సుఖమవుతే, దాని ననుభవించే తను ఎందుకు శాంతి పొందలేక పోతున్నాడు? దీనిని మించిన సుఖ మేదో ఉందని ఇప్పుడిప్పుడే తోస్తోంది తనకు!!

దీర్ఘంగా నిట్టూర్చాడు తను ఎం బి స్టూడెంటు అన్నట్లు రియలైజేషన్ రాక తప్పదేమో '!

దేశంలో కావలసినంత కీర్తి సంపాదించుకున్నాడు చిత్రలేఖనంలో గొప్ప ప్రతిభగలవాడని పేరు పొందాడు ధనానికి తనకు లోపంలేదు కాని ఏదో అసంతృప్తి అంకురిస్తూనే ఉంది మధ్య మధ్య దాని నెప్పుడూ తీవ్రం కానీయలేదు తను ఇంకా ఈ కీర్తి, హోదాలమీద మమత వదల్లేదు......

తన పూర్వపు చిత్రాలు, ప్రస్తుత చిత్రాలతో పోల్చిచూస్తే మొదటి వాటిలో హృదయ స్వచ్ఛందత్వం స్పష్టంగా తోస్తుంది. రెండవ వాటిలో ఏదో ఆడంబ



"నువ్వు మాయింట్లో కాలు పెట్టినదగ్గర నుంచి శాంతి నెలకొల్పబడింది అప్పుడే వెళ్లిపోతానంటావేరా! నాలుగు రోజులుంటే నీతోపాటు కమ్మగా తిందామనుకొంటున్నా!"

రత్వం గోచరమవుతూ ఉంటుంది. అది తన హృదయంలోనే ఉండి అలా భావింప చేస్తోందేమో మరి!!

ఏమైనా తను పూర్వపు 'గోపి' కాదు. పచ్చిక బయళ్ళలో, మాగాణీ చేలల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా సంచరిస్తూ పల్లె జీవితపు అమాయకత్వ మంతా పుణికి పుచ్చుకున్న ఆనాటి హృదయం కాదు తనది. తనను చూసీ చూడగానే సీత ఆ మాట అనక మానదు ..

'మారిపోయావురా గోపీ! ఎదిగిన కొద్దీ మనుషు లింతేలే!' అంటుంది తప్పకుండా

నవ్వుకున్నాడు. ఏమన్నా పడాలి. తప్పదు!!

తన నెవరైనా ప్రత్యక్షంగా కాక పోయినా, పరోక్షంగా తన వ్యక్తిగత జీవితాన్ని గురించి ప్రస్తావిస్తూ 'కవులూ, కళాకారులూ, సంఘ సంస్కర్తలూ,

వేదాంతులూ ఒకరి కాదర్శంగా లేకపోతే, ఆ వృత్తుల్లోనూ, సిద్ధాంతాల్లోనూ ఇతరులకు విశ్వాసమే నశిస్తుంది. అలాంటప్పుడు వాళ్లు మరింత హీనులు కావటాని కవకాశ ముంది' అంటే తను ఒక్క నవ్వు నవ్వేవాడు

'అనుభవించే భోగీ, అనుభవించని జోగీ నా దృష్టిలో ఒకటే। అనుభవించే వాడి కెప్పుడూ 'నాది' 'నేను' అని అనుభవించాలని ఉండదు ఇక అనుభవించని వాడిసంగతి సరేసరి!' అనేవాడు

'ఇంకేం అవుతే? 'నాది' 'నేను' అనుకోని మీ అనుభవాల్ని ఇతరుల కివ్వాలనా మీ ఉద్దేశం?' అనే వాళ్లు ఎగతాళిగా

'నా అంతట నే నాదేశించను కాని, నే నింకొకరి కాదర్శం కావటం నాకు ఇష్టమే। ఈ ప్రపంచంలో ఎవరికి వాళ్ల నింకొకరి ననుసరించాలని ఉండదు చెప్పండి? చెప్పులు కుట్టేవాడు ఆ వృత్తిలో ఇంకొకడికి గురువౌతాడు'

తనకు వాళ్ళు సమాధానం చెప్పలేక పోయేవాళ్ళు నిరుత్తరులైనా, తనవాదం అంగీకరించలేక అవస్తపడేవాళ్ళని చూసి తను నవ్వేవాడు


'మనిషి తా నింకొకరి కాదర్శం అవుతున్నానని కాని, కొందరి జీవితాల్ని తను నడిపించగలడని కాని అనుకోవటం నిజంగా వెర్రితనం ఎవరికోసం ఎవరూ హీనులుకారు ఎవరికోసం వాళ్లే ఉద్ధరింపబడతారు ఎవరి టైమ్ వచ్చినప్పుడు వాళ్లకది తప్పక సిద్ధిస్తుంది' అనేవాడు తను మళ్ళీ

ధర్మాధర్మ విచక్షణ లేని తన జీవితం వారికి నచ్చదంటే అది నిజంగా సహేతుకమే। కాదని తనెప్పుడూ అనడు కాక పోతే వాదనకోసం కొంత మొండితనాన్ని అవలంబించేవాడు సంఘ నియతిని పాటించటం తనకు మొదటినుంచీ అలవడిన విద్యకాదు అందుకే తన వాదం సమాధానపరచలేని దైనట్లే, అంగీకరించ తగినదిగానూ ఉండేదికాదు

కాని అనాదినుంచీ మానవ హృదయాలలో అసాధారణత్వంమీద అంతులేని భయమూ, సంకోచమూను। ఎక్కడైనా ఒక చోట సామాన్యత్వానికి అతీతంగానో, విరుద్ధంగానో ఒక భావం ఉత్పన్నమైనప్పుడు దానిని పరిపోషించటానికంటే, అణగదొక్కాలని ప్రయత్నిస్తారు మానవులు సామాన్యత్వంలో తపనలేనట్లే, అభివృద్ధీ లేదు కొత్త ఉద్యమంవల్లా, కొత్త ప్రయత్నాలవల్ల ఫలం ఆశించటమంటే అందని ఆకాశాలకు అర్రులు చాచటంగా ఉంటుంది చాలా మందికి అంతేకాదు, మానవులు తమ జీవితాలకూ, కుటుంబాలకూ, ధన ధాన్య సంపత్తికీ, తన అనుకున్న ఏ ఒక్క దానికి వైరుధ్యంకాని, అననుకూలత్వం కాని జరగనంత వరకు ఎన్ని మాటలైనా చెపుతారు. కాని వాళ్ళు చేప్పే ఆ మహా

శయాల కోసం తమ జీవితంలో ఏ ఒక్క దాన్ని త్యాగం చేయవలసివచ్చినా, ఆశయాలు ఒదిలి, జీవితాన్ని కావిలించుకుంటారు' 'బతికినన్నాళ్ళు ఇలా బతికితే చాలులే'' అనుకునే సంతృప్తి ఆత్మౌన్నత్యానికి ఎన్నడూ ఆస్కారం కాలేదు కాని, అది సంఘ శ్రేయస్సుకి ఎంతో ఉపకరిస్తుంది అయితే ఈ విధమైన సంతృప్తి కావాలంటే రాదు పోవాలంటే పోదు అది జన్మతః సిద్ధించేది మాత్రమే'

కాని తనలో సాంఘికమైన, వ్యక్తిగతమైన ఏ కట్టడికీ పట్టుబడని అతీతమైన, స్వచ్ఛందమైన మంచితనం, - మంచితన మనలేడు కూడాను దానిని, - ఔన్నత్యం ఎంత ఉన్నా, సంఘానికి తను పనికిరానివాడే అయినాడు అందుకే ఆశ్చర్యం వేస్తుంది తనకు బహిరంగమైన దుర్మార్గం సంఘం సహించదు తనది దుర్మార్గమైనా కాకపోయినా, సంఘపు నియమాలకు తను కట్టుబడలేదు కనుక, తను చేసేది దుర్మార్గంగానే నిర్ణయింపబడింది అదే తను పైకి శ్రీరంగ నీతులు చెబుతూ, లోలోపల ఎన్ని పాపపు పనులు తవ్వుకున్నా తన శ్రేయస్సుకీ, అస్తిత్వానికీ భంగం లేదుకనుక సంఘం తనని మన్నించి ఉండేదేమో! ఏమో' అసలీ చాటు మాటు వ్యవహారాల వల్లనే మానవులంతా నటులూ, ప్రపంచం ఒక నాటక రంగం కావటం తటస్థించిం దనుకుంటాడు తను!




"ప్రొద్దున్ననగా వండిన అన్నం - ఎప్పుడో చల్లారిందండి ఇంకెందుకు విసనకర్ర!"
"ఎందుకేవిటి కళా! ఈ పాసిన వాటిపై ముసిరే యీగల్ని విసరు కోడానికి'!!"

అయితే మానవులు తమకు విరుద్ధమైన, ఉన్నతమైన భావాన్ని ప్రారంభంలో ఎంత నాశనం చేయటానికి ప్రయత్నిస్తారో అంతంలో అది ఫలితానికివచ్చే సరికి అంతగానూ అభినందిస్తారు

ఇది మానవ నైజం అటువంటి మానవుల మధ్య తను జీవిస్తున్నాడు. తన చిత్రాలను మెచ్చుకుంటారు కాని, తనంటే భయం చాలామందికి మర్యాదస్తులు తనకి దూరంగా ఉండాలంటారు, ఒకవేపు తన కళ నభినందిస్తూనే' తనకు వాళ్ళ మాటలవల్ల బాధ కలిగినా, తనలోని రెండు గుణాలను తగిన విధంగా వాళ్ళు సత్కరిస్తున్నా రనుకునేవాడు అప్పుడు మాత్రం వాళ్ళ తీర్పులో కొంత న్యాయమే గోచరించేది తనకు' నిజానికి తనలో వ్యక్తిపరంగా ఫలితానికి వచ్చే దేముంది కనుక? అందుకే తనంటే కంటకం సంఘానికి'

సన్నగా తుప్పర ప్రారంభమైంది మబ్బుపట్టిన ఆకాశం ఏదో మాంద్యాన్ని, మనోవ్యాకులతను కలిగిస్తున్నది ..

ఆలోచిస్తున్నా డతను. పది పన్నెం డేళ్ళ తర్వాత అతనిలో ఒక విధమైన వైరాగ్యభావం ఉత్పన్న మైంది తను పోయాక తన చిత్రాలను గురించి చెప్పు కున్నంత గొప్పగా తనను గురించి చెబు తారా? కళాకారుడు నందగోపాల్ మిగులు తాడుకాని, వ్యక్తి నందగోపాల్ పంచ భూతాలకే నన్నమాట '

—వర్షం అధికమైంది జల్లు కొట్ట కుండా గాజుతలుపు లెత్తేసాడు

ఈ వర్షాకాలం అంటే తన కెందుకో చెప్పలేని ఆనందం అన్ని ఋతువులూ కొనితెచ్చేపాటిఆనందం నిజానికి వర్ష ఋతువు తనకివ్వనేలేదు ఐనా ఎందుకో అదంటే తనకు ప్రాణం అది తన హృదయంలో ఏనాడో అనుభూతమై అణగిపోయిన మధురబాధను, అన్వేషణా వేదనను, ఆ ఆవేదనలోగల సుఖశాంతిని అప్పుడప్పుడు తలపుకితెస్తూ ఉంటుంది అందుకేనేమో వర్షాకాల మంటే తనకంత ఇష్టం !!

— రోడ్డు సరిగా లేదు మధ్యమధ్య కారుకుదుపులకు విసుక్కుంటూ మూలగా ఒదిగి కూర్చున్నాడు తను

ఏవో ఆలోచనలు మనసు నాక్రమి స్తూనే ఉన్నాయి అంతకంతకూ తన జీవితం ఎంత విచిత్రంగా పరిణమిం చింది? పాతికేళ్ళవరకూ తను జీవించిన లోకం,'ఈ లోకానికి పిక్చర్ కాపీ'.'అనాడు తను వెలుగు కెంత సమీపస్థుడో – క్రమ క్రమంగాదానికి తనెంత దూరమయ్యాడో– నేడు పూర్తిగా దానిని కనుచూపులోనైనా కనలేని స్థితి కెలా వచ్చాడో – అదంతా తనకే తెలుసు ఆనాటి తన మానసికా వస్థనూ, మధుర ప్రశాంతినీ నిర్వచించ లేడు తను ''

కాని ఈనాడు ? ప్రప్రథమంగా రాధని స్త్రీగా కాక, కళాత్మక శక్తిగా తాను గుర్తించి ఉంటే తనింతగా పతనమయ్యే వాడుకాదు అంతేకాదు అటువంటిస్థితిలో ఆమెను తప్పక తాను పొందగలిగేవాడు కాని రాధలోని స్త్రీ తనలో వాంఛలు రేపింది ఆ ఉద్ధృతస్థితి నడగించటానికిక తనకే శక్తి చాలలేదు రాధపై ప్రేమ వాంఛావిషయికం కానట్లవుతే, అది తన ఊహా జగద్విచ్ఛిన్న హేతువు కాక, సుస్థిర స్థాపనకు సహాయభూత మయేది తన జీవితం వ్యక్తిగతంగానూ మహో న్నత మయేది రాధ తన సంస్కారంతో, సౌందర్యంతో తన కళ్ళు విప్పింది కాని తన ఆలోచనలు ఆ సౌందర్యాన్ని మించి అధికంగా పోకుండా తను జాగ్రత్త వహించి ఉంటే బాగుండేది కాని – అదే జరగలేదు......

నాటికీ, నేటికీ తనలోని మార్పు తరచి చూసుకుంటూఉంటే హృదయ మేదో అలసటతో, నిర్వేదంతో నిట్టూరు

స్తోంది ఇప్పుడేకాదు ఈవిధమైనఆవేదన ఈ పన్నెండేళ్ళల్లో తన కప్పుడప్పుడు కలుగుతూనేఉంది అలాంటప్పుడు రాధ తలపుకివస్తూనే ఉంది కాని ఎంత సేపు? అంతస్సునే అణచిపెట్టి విశృంఖలంగా సంచరించిననాడు, రాధ విషయంలో తనను తాను వంచించుకోవటంలో ఆశ్చర్య మేముంది?

అప్రయత్నంగా నిట్టూర్పు వెలువ డింది తనలోంచి

హఠాత్తుగా కారాగిపోతుంది

తన ఆలోచనలు కట్టుబడ్డాయి

'ఏమిటి డ్రైవర్ ?'

'బురదలో చక్రాలుకూరుకుపోయాయి సార్!'

ఈ వర్షాకాలంలో కారుమీద ప్రయాణం కావటం తనదే తప్పనిపించింది అందులో ఈ చాయలకు తను వచ్చి ఎన్నేళ్ళైందో? అప్పటికంటే ఇప్పుడు రోడ్డు కాస్త బాగుపడిఉండదా అనుకున్నాడు ఏమీలేదు అప్పుడూ, ఇప్పుడూకూడా ఒక్కటే తీరుగా, గుంటలు, మెట్టలుగా ఉంది ఏమీ ఏదీ మారినట్లు లేదు ఒక్క తనే—తన జీవితమే!

నవ్వొచ్చిందీ సాదృశ్యానికి తనెంత పతనం చెందినా ఈరోడ్డంత అధ్వాన్నంగా మాత్రం లేదు

'రా డ్రైవర్! తప్పేదేముంది? ఇద్దరం పైకి లాగుదాం రా!' అన్నాడు



"డబ్బు లేదుకాబట్టే పెద్దమనిషిలాగా క్రింద కూచున్నాను జాగ్రత్త. వొంటిమీద చెయ్యివేశావంటే!"

కాని విఫల ప్రయత్నమైపోయింది. చక్రాలు లాగినకొద్దీ కూరుకుపోతున్నాయి

చీకటి పడుతోంది. సన్నగా తుప్పర ప్రారంభమైంది మళ్ళీ

నిస్సహాయంగా ఇద్దరూ దిక్కులు చూస్తూ నుంచున్నారు ఎవరో మనిషి ఎదురుగుండా వస్తుంటే అతన్ని పిలిచి మళ్ళీ ప్రయత్నం చేశారు. లాభం లేక పోయింది

'ఊళ్ళోకి వెళ్ళి మనుషుల్ని పిలుద్దాం బాబూ' అన్నాడు రైతు

'ఊరెంత దూరముంటుంది ?'

'ఎంతో దూరమెక్కడ బాబూ! ఇక్కడే! నాలుగడుగులేస్తే వచ్చేస్తుంది!'

కారు పైకి లాగినా ఆ రాత్రికింక ఎలాగూ ప్రయాణంచేయటం అసాధ్య మనుకున్నాడు తను ముందు ముందు రోడ్డింతకంటే అధ్వాన్నంగా ఉండవచ్చు

వానలో, ఈ బురదలో మళ్ళీ ఎక్కడైనా ఇలా అయితే యాతన ! !

'మీ ఊళ్ళో ఈ రాత్రికి బసచెయ్యటానికి వీలుంటుందా ?'

'అయ్యో ! ఎందుకుండదు బాబూ ! మీబోటి పట్నం బాబే ఉన్నాడు ధర్మరాజు !' అన్నాడు రైతు

డ్రైవర్‌తో ఊళ్ళోకెళ్ళి మనుషుల్ని పంపిస్తానని చెప్పి రైతుతో బయలు దేరాడు తను

ఇంకా సన్నగా తుప్పర పడుతూనే ఉంది బురదలో కాళ్ళీడ్చుకుంటూ ఎలాగో ఊళ్ళోకి ప్రవేశించారిద్దరూ

రైతు తనకు కొంచెం ముందు నడుస్తున్నాడు బురదతో తను పడుతున్నంత అవస్థ రైతు పడటం లేదు హాయిగా నడిచి వెళ్తున్నాడు జీవితాన్ని, విధిని ఎదురొడ్డి నిలవటం ఎలాగైనా గ్రామీణులకే తెలుసు తమకంటే ! !

వీధుల్లో దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి

'మన దే ఊరు బాబూ!' అని అడుగుతున్నాడు రైతు

మబ్బుపట్టిన ఆకాశమూ, వెలుగు లేని వీధులూ చూస్తున్నాడు తను ! సన్నగా తుప్పర! ఆ వర్షాయామినిలో, విజనమైన ఆ వీధులుగడచి వెళుతూఉంటే ఏదో బాధ కెలికింది హృదయాన్ని ప్రకృతంతా లౌకిక వాసనలతో ముసురుకున్న తన ఆత్మకు ప్రతిరూపంగా, కళావిహీనంగా తన ఎదుట నిలచినట్లయింది ఆ వానరాత్రి!! తన జీవితం ఎంత తారుమారైంది? ఏదో పోగొట్టుకున్నాడు తను అది మళ్ళీ దొరుకుతుందన్న ఆశలేదు తనకు! అసలా పోగొట్టుకున్న దేదో తెలిస్తేనేగా దానిని తిరిగి సంపాదించుకోవటానికి ! !

'ఇల్లింకా ఎంత దూరముంది ?' అనడిగాడు రైతుని

'ఇదిగో ! ఇదే బాబూ !'

ఇంచుమించు ఊరి పొలిమేరలకు వచ్చేశారు పంటలూ, పైర్లూ రోడ్డు ప్రక్క మూగగా 'మేమే మీ పోషకులం' భూమాత ప్రతినిధులం !' అని చాటి చెబుతున్నాయి. తను మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాడు ఏదో ఆవేదన, ఆత్మపడే ఆవేదన హృదంతరాళాల్లో సన్నగా, తీయగా, బాధగా మెలిపెడుతోంది తన ఆత్మకు పురిటి నొప్పులు స్ఫురిస్తున్నాయి

— ఆకాశంలో మెరుపు మెరిసింది

'అదే బాబూ ఇల్లు !' అన్నాడు రైతు వేలితో చూపిస్తూ

ఊరిబయట, పొలాల మధ్య చక్కని బంగళా చూశాడు తను ఎంతో సంతోషం వేసింది ఇటువంటి పల్లెటూళ్లోకూడా ఇంత చక్కని బంగళా ! ! ఇల్లు చూస్తేనే కడుపు నిండినట్లనిపించింది !

బంగళా సమీపించారు లోపల పెట్రో మాక్సు దీపాలు వెలుగుతున్నాయి

'బాబూ !' అని పిలిచాడు రైతు లోపలివారి నుద్దేశించి

'ఎవరూ ?' అంటూ ఒక వ్యక్తి బయటికి వచ్చాడు

తను నిర్ఘాంతపోయి నుంచున్నాడక్కడే ! ఇది నిజమా ? ఇదేమిటి ?

రావుగారు తన ఎదుట !

'అరె ! రావుగారా ? ఇదేమిటి ? చాలా తమాషాగా ఉందే !' అంటూ ఒక్క అంగలో వెళ్ళి ఆయన ఎదుట నిలబడ్డాడు తను

'ఎవరూ ? అరె ! గోపాల్ ! ఇదేమిటోయ్ ! రా ! రా ! లోపలికి రా ! కూర్చో !' ఆశ్చర్యానందాలతో గుక్క తిప్పుకోలేకపోయాడు రావు

రైతు తమ యిద్దరివైపూ ఏమిటో అర్థంగాని అయోమయపు చూపును చూస్తున్నాడు రావూ, తనూ హడావుడిగా ఏదో మాట్లాడుకుంటున్నారు

'బాబూ నేను మనుషుల్ని పిల్చుకెళ్ళి కారు తీసుకొస్తానయ్యా!' అన్నాడు రైతు

'ఆఁ ఆఁ !ఆ సంగతే మర్చిపోయాను మనుషుల్ని కూలికి మాట్లాడుకు వెళ్ళు లేకపోతే ఇంతరాత్రివేళ రారేమో? ఊఁ ఇంద ఇవాళ నువ్వు నాకు చేసిన సహాయం చాల గొప్పదోయ్!' అంటూ ఐదు రూపాయలనోటు అతని చేతిలో పెట్టాడు,

'ఎబ్బెబ్బే! ఎందుకుబాబూ!' అంటూనే రైతు దానిని తీసుకుని సంతోషంగా వెళ్లిపోయాడు



"ఏమయ్యా! నాకిప్పుడు డబ్బు చాల అవసరంగా ఉంది నా గడ్డాన్ని చాల రోజులనుండి పెంచుతున్నా దీనిని తీసుకొని సరిపడే డబ్బివ్వు."

---

'ఏమిటి ? కారేమిటి ? కూలీ ఏమిటి ? ఏమిటోయ్ గోపాల్ ? ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్తున్నావ్ ?' అని అడిగాడు రావు.

తను జరిగిందంతా చెప్పాడు.

హఠాత్తుగా రావు 'గోపాల్ వచ్చాడు రాధా!' అన్నాడు గుమ్మంవేపు చూసి

పిడుగుపాటుకి నిద్రితవ్యక్తిలా ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు తననోరు కట్టుబడింది. తన గుండెలాగిపోయాయి గుమ్మంలో. రాధ!

గోధుమరంగు జరీచీరె కట్టుకుని, చక్కని బొట్టు పచ్చని ముఖాన మెరుస్తూ ఉండే దీపపు వెలుతుర్లో దేవతలా గంభీరంగా నిలబడి ఉంది

తన ఆలోచన లాగిపోయాయి. మనసు స్తబ్ధమైపోయింది స్త్రీలనే ఎరుగడా తను? రాధముందు ఇదేమిటి ?

'ఎప్పుడు వచ్చారు ?'—మబ్బు మధ్యన మెరుపులా చిన్న నవ్వుతో, సన్నగా పలకరించింది

ఆ ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు తను

బలవంతాన నవ్వుతెచ్చుకుని 'ఇప్పుడే వచ్చాను. బావున్నారా?' అని అడిగాడు

'ఏం బాగుండటమోయ్? రాధ మారి పోయింది...' అంటున్నాడు రావు

తను ఆమె వేపు చూశాడు. ఆమె గబగబా చూపులు మరల్చుకున్నది

'మీరిక్కడ ఉన్నారేమిటి ?' అని అడిగాడు తను.

'ఇది మా స్వగ్రామమోయ్! రిటైరై ఇక్కడికి చేరాం. అసలిక్కడికి రావటం రాధ పట్టుదలే! పల్లెటూరు ప్రశాంతంగా ఉంటుంది పోదాం పదమని ఒకటే గోల! లేకపోతే నేను మెడ్రాస్‌లోనే సెటిల్ అయేవాణ్ణి!'

శాంతి కావాలా? ఏం? ఆమెకు లేదా? అనిపించింది తనకు ఆమెవేపు చూసాడు మళ్ళీ.

'పదండి. మీరు స్నానం చేస్తే...' అంటోందామె.

'ఏం గోపాల్? మా యింటి నుంచి వెళ్లాక మమ్మల్ని పూర్తిగా మరచి పోయావు. నీ రూమ్ అడ్రెసివ్వలేదు పైగా నువ్వు మా యింటికి రాలేదు. పైగా ఫోన్‌చేసినా వస్తానని రాకపోవటం నేర్చుకున్నావు! ఊం. ఇదన్నమాట స్నేహం?' అంటున్నాడు రావు

తను రాధ వేపు చూస్తున్నాడు

చూపులు తట్టుకోలేక కిందికి చూస్తూ కూర్చుంది రాధ నిస్సహాయంగా

'పారిస్ వెళ్లావుట కదూ? నువ్వు పారిస్ వెళ్ళటం పేపర్లో చూసి రాధ '

'మీ రిక్కడి కెలా వచ్చారు?' అని అడిగిందామె

తను చెప్పాడు.

'నువ్వు పారిస్ వెళ్ళినపుడు రాధ రావుకి విశేషాలూరికే ఊరిపోతున్నాయి.

'బలేవాడివి నాన్నా! ఆయన ఇంటి దగ్గర ఎప్పుడు బయలుదేరారో? స్నానం చేసి, భోజనం చెయ్యనివ్వకుండా ఏమిటి చెప్పు ఈ కబుర్లు?'—మృదువుగా మంద లించింది తండ్రిని

తను ఆమె ఆంతర్యం గుర్తించాడు ఆమెనుగురించి ఒక్కమాటకూడా తనకు తెలియటం ఇష్టంలేనట్లుంది రాధకు 'రాధ' అని రావు చెబుతున్నప్పుడల్లా అడ్డుతగుల్తోంది.

'పదండి మీరు స్నానం చేద్దురు గాని...'

'అవునోయ్! పద! పద!' అన్నాడు రావు కర్తవ్యం స్ఫురించినవాడిలా

స్నానంచేసి, భోజనంచేసి విశ్రాంతిగా కూర్చునేలోగా కారు తీసుకుని డ్రైవర్ వచ్చాడు. డ్రైవర్‌కూడా భోజనంచేసాక,

అందరికీ పక్కలువేయించి తనగదిలోకి వెళ్ళిపోయింది రాధ

* * *

రాత్రి చాలా పొద్దుపోయేవరకూ రావుతో కబుర్లు చెబుతూ కూర్చున్నాడు తను. మాటల సందర్భంలో రావు విషాదంగా అన్నాడు —

'రాధ ఏమిటో పూర్తిగా మారిపోయింది గోపాల్! నా బలవంతాన M. A. చదివింది. ఆట్టే మాట్లాడదు. మనసులో మాట చెప్పదు' అంటూనే చప్పున నిగ్రహించుకుని సంభాషణ మార్చేసాడు.

తనహృదయాన్ని చెయ్యిపెట్టి కెలికినట్లయింది. ఆ మాట చెప్పిన తరువాత రావుతో సంభాషణ అంతా చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందమే అయింది

......ఇల్లు నిద్రిస్తోంది ప్రాణికోటి నిద్రిస్తోంది. కీచురాళ్ళ మోతా, అప్పుడప్పుడు పక్షులరెక్కల్లార్పులూ తప్ప మరే శబ్దమూ వినిపించటంలేదు ఆ ఒక్క రాత్రిలోనే తాను లోకానికి వెలిగా, కంటికి కునుకూ, మనసుకి శాంతీలేక జన్మ జన్మాలనుంచీ బాధితుడిలా యమయాతన ననుభవిస్తూ గడిపాడు మానసికంగా ఎందుకు? ఏమో! ఈ అవ్యక్తావేదనకు తాను అర్థం చెప్పుకోలేడు తనకేదో కావాలి. రాధకూ, తనకూ ఏదో అవినాభావ సంబంధం ఉంది ఆంతరంగికంగా. అందుకే ఆమెను గురించి రావు చెప్పిన ఆ ఒక్కమాటా తననింత కదిల్చివేస్తోంది

రాధ మారిపోయిందా? అవును అని తనకే అనిపిస్తోంది కాని రావు ఊహించిన విధంగా మాత్రంకాదు విషాదంతో, వైఫల్యంతో, చివికిపోయిన గుండెలతో నిరాశగా బ్రతకటంలే దామె అది కేవలం బాహ్యదృష్టికి కనిపించే విధం మాత్రమే' కాని ఆమెలో ఇప్పుడు ఎవరూ సామాన్యంగా గుర్తించలేని అంతర్ముఖత్వం గోచరమౌతోందితనకు. ఇంతకు మునుపు ఆమె సేవించవలసిన శక్తి! ఇప్పుడనుగ్రహించగల దేవత'!

ఇన్నేళ్లు ఈ విధంగా సుఖంకోసం, శాంతికోసం వెర్రి మొర్రి మార్గాల వెంట పడి పరుగు లెత్తినా, పతనం తప్ప తనకేమీ అంతు చిక్కలేదు ఆ మధ్యనే సత్యమని నమ్మించుకుని ఆనందంగా కాలం గడిపాడు కాని అంతస్సూత్రంగా తనను వెన్నాడి వచ్చిన ఆవేదననూ, అశాంతినీ మాత్రం ఆమూలాగ్రంగా అణచివేయలేకపోయాడు. ఆశ్చర్యం ఏమిటంటే తన మనసీ స్థితిలో ఎప్పుడూ రాధను మధ్య ఉంచుకుని, ఆమె నావరించి పరిత ప్తమౌతోంది

రాధ తన కళ కాదర్శం ఏనాడు తన కళాజీవితానికి శంఖుస్థాపన జరిగిందో ఆనాటినుంచీ తన హృదయంలో నిక్షిప్తమై ఉన్న సౌందర్యస్వరూపాని కొక వాస్తవికమైన రూపం దాల్చి, తన

హృదయాంతరాళ భావసందోహాన్ని తనలో మలచుకుని నిలిచిన వ్యక్తి రాధగా తాను గుర్తించాడు కాని కళాకారు డెప్పుడూ వాస్తవికమైన అనుభవాలను హృదయంతో అర్థం చేసుకోవటంలోనే వాటి సార్థకత వెల్లివిరుస్తుంది. తను ఆ జాగ్రత వహించలేదు ఎప్పుడు రాధను తన మనసుతో విచారించ సాగాడో అప్పుడే భౌతికావసరా లతిప్రాముఖ్యం వహించి కూర్చున్నాయి తనలో. అందు వల్లనే రాధ తన కళ కాదర్శం అయినా ఆమెను పొందగలిగిన విధం మాత్రం విస్మరించాడు. ఆమె తనకు దూరమైంది! కాని రాధ తన కళాత్మకమైన హృద యాన్నే కనుక అధివసించిఉంటే తన కళ ఇంకా పరిపూర్ణస్థితి నందుకోగలిగేది తన కళలో ఆమె జీవించేది. కాని విధి వ్యత్యస్తమైంది. తానిప్పుడు గొప్ప కళా కారుడే కాని శాంతిలేదు తనకు. శాంతి కోసం తానింకో జీవితం ప్రారంభించాలి. తప్పదు. ఎం బి స్టూడెంటు అన్నట్లు రియలై జేషన్ రావాలి!

తా నవలంబించిన విశృంఖల వృత్తి తనలోని నూరేళ్ల ప్రతిభను సగానికి సగం మింగేసింది అందుకే మునుపటంత ప్రేరణ శక్తి, బొమ్మలు వేస్తేనే కాని బతకలేనన్నంత ఉద్వేగమూ కూడా లోపి స్తున్నాయి తనలో! తన కళాశక్తి చచ్చి పోతోంది, దానికి తగిన ఆత్మ పరిపోషణ లేక!!

రాధ తనదే అయిఉంటే కళకు శక్తి తోడై ఆజన్మాంతం తను కళాకారుడు గానే ఉండేవాడు కాని తనతో పాటు ఆమెనూ వంచించాడు. అందుకే తనింక ఎక్కువ కాలం కళలో జీవించ లేడు. తనలో కళాసామగ్రి తరిగిపోతోంది.

రాధ తనను బాధిస్తోంది కేవలం 'రాధ' అనే ఆ రెండక్షరాల స్ఫురణే తన స్థావరాన్నంతా సమూలంగా కదల్చి వేస్తోంది. తన అంతస్సు రాధ! లేక పోతే ఆమె వాడిపోతోంటే తనకెందు కింత బాధ??

ఆలోచనతో తల పగిలిపోతోంది.

వేడి నిట్టూర్పులు ముసురుకున్నాయి హృదయాన్ని! తా నిక నిలువలేక పోయాడు.

మెల్లిగా లేచాడు

'అది శరద్రాత్రి! శీతచంద్రాతపాంతరాళ
రమణీయ రజత తల్పంబు నందు
చల్లగా నిద్రవోవు ప్రేపల్లె వాడ —'

అలాంటి సమయంలో తను 'శాంతి దేవతాచరణలాక్ష రసారుణాంక లవలేశ ముల వెతుకాడు' కొనే నిమిత్తం బయలు దేరాడు.

చాలా మెల్లిగా రాధ గది దగ్గరకు వచ్చాడు. గదిలో బెడ్‌లాంప్ వెలుగు తోంది.


ధైర్యంగా లోపలికి వెళ్లాడు. హృద యాన్ని పాపవాంఛ సోకితే భయం!

రాధ విషయంలో ఇప్పుడు తన కా ఆలోచనలేదు భయ మెందుకు?

పక్కమీద రాధ కదిలింది నిద్రపోతున్నట్లు లేదు. తన నీడ చూసి కంగారుగా 'ఎవరు ?' అంటూ లేచింది.

'నేను......' వణుకుతున్న కంఠంతో అన్నాడు.

గబగబా లేచి దీపం పెద్దది చేసింది తననుచూసి ప్రాన్పడి అక్కడే నిలబడిపోయింది.



'ఎందుకు వచ్చారు?' అంది తేరుకుని.

'ఎందుకు?'—ఎంత నిర్దయ! ఏమంటాడు తను? ఎంకావాలో ఆమెకు తెలియదా? పూజించిన దేవతలూ, ప్రేమించిన స్త్రీలూ ఇలాగే పరీక్షిస్తారు కాబోలు!!

జన్మ జన్మగత బాధలన్నీ హృదయంలో వడులు సుడులై తిరుగుతున్నాయి. వేయి దుఃఖ స్రవంతులు కంఠంలో చెలగి రేగుతున్నాయి

రాధ ప్రశ్నకు సమాధానం లేకుండానే తనకళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి, తనకే ఆశ్చర్యంగా.

రాధ కళ్ళు అశ్రువులతో ఆగుడ్డి వెలుతుర్లో అందంగా మెరిశాయి.

'ఎందుకు?' అంది దగ్గరకువచ్చి లాలనగా.

పెద్దగా రోదనధ్వని ఒకటి వెలువడింది తన కంఠంలోంచి! ఆమె గుండెల మీద తలవాల్చి పడ్డాడు

రాధ నిశ్చలంగా నుంచుంది. ఓదార్చటానికి ఎటువంటి ప్రయత్నమూ చేయ్యలేదు. తను ఏడవగలిగినంత సేపు ఏడవనిచ్చింది.

కాస్సేపటికి తేరుకున్నాడు దుఃఖంలోంచి! ఆమెవేపు జాలిగా చూసాడు

'పిచ్చివాడా! ఎందుకూ?' అని అడిగింది ప్రశాంత ప్రసన్న వదనంతో

ప్రేమ నిర్భరమైన ఆ లాలన తనకు మళ్ళీ దుఃఖం తెప్పించింది పక్షిపిల్ల వాడిలా తలచుకుని తలచుకుని కుమిలిపోయాడు

రాధముఖంలో ప్రసన్నత్వ మధికమవుతోంది

'వెళ్ళి పడుకోండి' అంది మృదువుగా

'రాధా ' రాధా ' నాతో..... '

ఆపైన ఆమె చెప్పనివ్వలేదు పూర్వంలా తొట్రుపడుతూ వెళ్ళిపోనూ లేదు ప్రశాంతంగా నవ్వింది

'ఏమిటి నీతో' పిచ్చిగోపీ' మనుషుల కోసం కాలం ఆగదు కాలంతోపాటు మానవు డభివృద్ధి చెందకపోతే జీవితమే వృధా! చూడు నీతోవచ్చి నేనేం చేయాలిప్పుడు? నీవే దిగజారిపోయావే! ఇక నన్నుద్ధరించగలవా?'

ఎంతసూటిగా అడిగింది! తన హృదయాన్నలుముకున్న పంకిలమంతా విదల్చి వేసేటంత తీవ్రంగా అడిగింది!

'నేను చెడిపోయాను రాధా! భౌతికంగానే! మానసికంగా కాదు!' అన్నాడు తను గాద్గదికంగా

రాధ విషాదంగా నవ్వింది

'పురుషులు చెడిపోరు గోపీ! దిగజారి పోతారు భౌతికమైన దోషాలు పురుషులకు మానసికమైన దుష్పరిణామాలకు దారితీస్తాయి స్త్రీలలోని ప్రేమోద్రిక్తత వారి పతనానికి హేతువు' పురుషులలోని అహంకారం వారి ఔన్నత్యానికి ఆటంకం!'

'కాని నువ్వులేకుండా నేనింక బతక లేను రాధా ''—తను మళ్ళీ రాధ హృదయం కరగించివేసేట్లు దుఃఖించాడు

'పిచ్చిగోపీ' నా మనసుని కరిగించి నన్ను మళ్ళీ చలింప చేయకు! ఈ జీవితానికింక నీకు నేను కాలేను అదే! ఈ శరీర మిలాగే వాడిపోవాలి నీకు తెలియదు ఎప్పటికైనా, ఆనాడు నీ చిత్రంలో నీవన్నమాటల్ని నీవు నిలబెట్టుకోలేక పోయావు కాని, ఇప్పటికీ నీమాటలు నేనంటాను నేను నీకే గోపీ' కాని మన కలయికమాత్రం అసంభవం! మనసు ఎప్పుడూ నీకే''

తనేమీ మాట్లాడలేకపోయాడు. బాధతో బ్రద్దలవుతోంది హృదయం

'గోపీ' ఇలా ఎన్నిసార్లు కలవరించాను నీ కోసం! ఒక్కనాడైనా నీకు నేను తలపుకి వస్తే చాలునని పరితపించాను. నీవు వెళ్ళిపోయాక, మళ్ళీ ఏనాడు నీవు వచ్చి తలుపు కొడతావో, ఏనాడు నన్ను పిలుస్తావో నని ఎంత తహతహలాడుతూ ఎదురు చూశాను? కాని నా ఆశ నిరాశ అయింది ఈ జీవన మధుభాండం ఒక్కరికే! నీవు రాలేదు. నేను మిగిలా నొంటరిగా నీ రాకకై నిరీక్షిస్తూ! ఆ దీర్ఘ నిరీక్షణలోనే నే నొక మహార్థం గుర్తించగలిగాను. ఈనాడు నీ కోసం నిరీక్షించి నిరీక్షించి ఎప్పుడో మృత్యుగహ్వరంలోకి త్రోయ బడతాను. మరొక



"మీ అమ్మను తీసుకురావద్దని టెలిగ్రాం ఇచ్చానుగా!"
"ఆ కారణ మేమిటో తెలుసుకోడానికి అమ్మ వచ్చింది."

జన్మలోనూ ఇంతే కావచ్చు. పరంపరాగతమైన ఈ నిరీక్షణకి అంతం పరమార్థం ఒక్కటే! భగ్నమై రగిలే ఈ హృదయాన్నింకా భగ్నంచేయట మెందుకు? నేను నీ నిరీక్షణలో నుంచి ఒక మహాయాత్రను గమిస్తున్నాను ఈనాడు నా గోపీ నాకు లభించలేదనే బాధ లేదు!' అని ఆగింది రాధ.

తను ఉత్కంఠతతో వింటున్నాడు.

రాధ మళ్ళీ ప్రారంభించింది.

'కాని,—కాని ఆనాడు నీవు మరొకసారి నా అభిప్రాయం అడిగి ఉంటే నేను నీకే అయిపోయే దాన్ని గోపీ! కాని నీకు స్త్రీ హృదయం తెలియదు!'

'ఇప్పుడు తెలుసుకున్నాను......' అన్నాడాశగా.

నవ్వింది తల్లి పిల్లవాడి అమాయకత్వమూ, వ్యర్థపుటాశా చూసి నవ్వినట్లు.

'ఏం లాభం? నీవు లోకానికై, నేను

లోకం నుంచి విడిపడ్డాక! నేను నీ స్థితికి రాలేనప్పుడు నీవు నా స్థితికి రాలేవు! ఒకవేళ వచ్చినా, నే నప్పుడింకా ముందుకి పోగలనేమో? పోలేకపోయినా, అప్పుడు నీవే కోరవు నన్ను! అదే' ఈవిధంగా కోరవు!' కాని ఆనాడు స్త్రీ హృదయమెరుగని అనుభవ రహితమైన నీ వ్యక్తిత్వం నన్నెంత ఆకర్షించింది!' నీవు వెళ్ళిపోయాక నాఅంతట నేను నిన్నెందుకు దాచుకోలేకపోయానని ఏడ్చాను! ఏంలాభం?. ఈనాటి ప్రశాంత గంభీరమైన మానసిక స్థితి ఆనాడు నాకుండి ఉంటే అలాగే చేసేదాన్నేమో ప్చ్...అది గతం: ఎందుకు తలచుకుని??'

చంద్రుడు క్రమంగా కిందికి దిగబోతున్నాడు కిటికీ నానుకుని నుంచుని చెబుతోంది రాధ

'నువ్వూ మారిపోతావు గోపీ! లోక జీవిత సంగ్రామంలోపడి దానిని సుఖమని నీవెంత కౌగిలించుకున్నా, కాదనే అంతర్ఘోష నీలో ఉండనే ఉంది. అదే చెబుతాను గోపీ! అలౌకికానందంతో కాని సంతృప్తి చెందలేని మనసులెంత మభ్యపెట్టినా, అశాంతితో తరుమబడి చివరకెలాగూ ఆ ఆనందానికే అర్రులుచాచి తీరుతాయి...'

రాధమాటలు వింటున్న తనకు—తనలోని అవ్యక్తావేదనకు, ఇంతవరకూ తాను ఇదమిత్థం అని తేల్చుకోలేని బాధకు ఒకహేతువు లభించినట్లయుంది. తనకు అలౌకికానందం కావాలి...అదే తనకు కనిపించని వస్తువు! కనిపెట్టలేని వస్తువు!!

రాధ సామీప్యతలో, కేవలం ఒక్క క్షణకాలంలోనే, తన మనసులో ఏదో వింత పరిణామం కదులుతోంది.

తెల్లవార బోతోంది. కిటికీలోంచి బయటికి చూసి 'ఇంక వెళ్ళి పడుకోవూ?' అంది లాలన ఉట్టిపడే స్వరంతో.

మంత్ర రుద్ధ భుజంగంలా అక్కడి నుంచి వచ్చేసాడు. సంకల్ప వికల్ప శక్తులు కోల్పోయి గాఢంగా నిద్రకు పడ్డాడు. ఎంతసేపు అలా నిద్రపోయాడో కిటికీలోంచి చుర్రుమని ఎండ తాకేవరకూ ఒళ్ళే తెలియలేదు.

* * *

జీవితంలో రాధను మళ్ళీ కలుస్తానని కాని, తను ఈ విధమైన జీవితం మళ్ళీ గడుపుతాడని కాని ఆశలేదు తనకు అయితే అదే సంఘటించింది,

రాధదగ్గర తను సరిగ్గా నాలుగు రోజులున్నాడు. ఈ నాలుగురోజుల్లోనూ నాలుగు జన్మలెత్తినా మారలేనంత గొప్పగా మారాడు తను. అందుకే క్షణమంత విలువైనది జీవితంలో!!

రాధ అన్నది —

'ప్రపంచానికి రెండు పక్షాలు ఒకటి లౌకికం రెండవది అలౌకికం. నువ్వు నీ జీవిత ప్రారంభంలో అలౌకికంగానే ఉన్నావు! కాని ఏమీ ఎరుగని నిర్మో

హత్వ మదే విన్నాకర్షించే వస్తువులు ప్రపంచంలో ఉన్నాయనీ. వాటిని గురించి నువ్వు నిర్వికారంగా ఉన్నావనీ స్ఫురణలేదు నీ కప్పుడు. కాని నువ్వు మోహపడిపోయావు తర్వాత. అయితే నువెక్కడ ఉండేవాడివో అక్కడికే వచ్చావిప్పుడు. కాలం వృథా అయిందని పశ్చాత్తాపడుతున్నావా? ఈ సత్యం తెలుసుకోవటానికే నే నిన్నాళ్లు కలతపడి పోయా ననుకుంటున్నావా? నువ్వు కాలం వృథా చేయ లేదు. ఏమీ తెలియక అమాయకంగా ఉండటం అజ్ఞానం. అన్నీతెలిసి గంభీరుడు కావటం ఔన్నత్యం. నువ్వది సాధిస్తావు. దిగులు పడకు గోపీ!' అంది తనకు ధైర్యం పురి గొల్పుతూ.

—సీతను చూసి మెద్రాస్ వచ్చేసాడు తను.

రోజులు గడుస్తున్నాయి. కాని తను పూర్వంలా లేడు. తనలో ఏదో మార్పు వస్తోంది.

'హఠాత్తుగా బాగుపడ్డాడు!' అన్నారు కొందరు

బాగుపడటమంటే వారి దృష్టిలో ఒక్కటే అర్థం!

'విచిత్ర వ్యక్తి! వేళా వేళలు బుద్ధి స్థిరంలేదు!' అన్నారు ఆదరించుతాడని ఆశపెట్టుకు వచ్చిన స్త్రీలు.

మొత్తంమీద అందరూ తననించి దూరమౌతున్నారు.

ఒకనా డొక జమిందారు ఒకఫోటో రంగుల్లో అద్భుతంగా చిత్రిస్తే ఎంతైనా సరే ఇస్తానన్నాడు.

ఒప్పుకున్నాడు తను చిత్రం గీయ టానికి కూర్చున్నాడు కాని బుద్ధి పని చెయ్యలేదు గీత లస్పష్టంగా, వంకర టింకరగా వచ్చేస్తున్నాయి. ఇంతకు మునుపు బొమ్మలుగీస్తూ రాత్రులకు రాత్రులు జాగరణ చేసేవాడి కిప్పుడు ఊరికే కళ్ళు మూరుకుపోతున్నాయి నిట్టూర్చాడు తను. తన కళా ప్రాభవం తొలగిపోయే సమయ మాసన్న మైంది.

చెప్పిననాటికి చిత్రం అందించలేక పోయాడు తను జమిందారికి. ఆయన ఇంకొంచెం వ్యవధి ఇచ్చినా పూర్తిచేయ గలనన్న నమ్మకం కాని, చెయ్యాలన్న ఆసక్తికాని లేదు తనకు ఫోటో తీసు కుని జమిందారు వెళ్ళిపోయాడు.

తనకే కాదు —ప్రజలకు కూడా క్రమంగా తన చిత్రలేఖనంమీద ఆసక్తి తగ్గిపోతుంది! తను బొమ్మలు గియ్యలేక పోతున్నమాట నిజమే' కాని అలా ప్రజలలో తనగురించి ప్రచారం కావటం తనకెంత బాధగా ఉంది!'

అన్నిటికంటే, ఈ జనం మధ్య, ఈ కలకలంలో తను నిలవలేక పోతు న్నాడు. భరించలేని అశాంతి తననెక్క డికో తోసేస్తోంది తనింక ఈ ప్రపంచం మధ్య నిలవ లే ననుకుంటున్నాడు.

ఆ సమయమూ ఆసన్నమైంది. ఒకా నొక క్షణంలో తను ఇల్లూ, వాకిలీ, ప్రాణప్రదమైన చిత్రలేఖనమూ, అన్నీ ఒదిలేసి ఈ పర్ణకుటీరానికి వచ్చి వాలాడు

* * *

మానవ జీవితంలో ఏనాటికైనా సత్యం సుస్పష్టం కాక తప్పదు ఆ తపన హృదయంలో చెలరేగక తప్పదు కాని, తను శక్తులుడిగిన వార్ధక్యంలో కాక, ఏమీ తెలియని అజ్ఞానంలోనుంచి, అన్నీ తెలిసి అనుభవించే ఉన్మాదంలోనుంచి ఉద్ధరింపబడి అలౌకిక జీవిత పథగామి అయినాడు. తన మనసింక చలించదు ఎక్కువకాలం వృథాకాకుండా తనలో త్వరలోనే వెలుగును పునః స్థాపన చేసింది రాధ

ఇప్పుడీ పచ్చని మైదానంలో నీలాకాశంవేపు దృష్టి సారించి, కొన్ని మైళ్ళ వరకూ తను మైదానమూ, ఆకాశమూ తప్ప మరేమీలేని ఆ చిన్న గోళంలో కూర్చుని ఆలోచిస్తూ ఉంటే, ఆ సౌందర్యంలో తన జీవితపు హాలాహలం, విశ్వ మానవకోటి ఆక్రందనలా హృదయానికి వినిపించి రసార్ధ్రమై పోతుంది మనసు ! గత జీవిత స్మృతులు, తానుపొందిన వంచనలు, చేసిన దోషాలూ అన్నీ 'తలపుకివచ్చి మాధుర్యంతో, భాధతో, పశ్చాత్తాపంతో నిండిపోతుంది, హృదయం ! ఆర్ద్రాతిఆర్ద్రమైపోయిన గుండెలతో తానెన్ని కన్నీళ్ళు కార్చాడు??

'ఎదమెత్తనౌటకై
సొదగుందరా అంత
మదిగల అహమ్మెల్ల
వదలిపోవునురా'—

మానసికంగా తా నెంత బాధ అనుభవించా డింతవరకూ! తన దోషాలే తన బాధ! కాని అవి దోషాలు కావేమో! ఔన్నత్యశృంగారోహణా ప్రయత్నాల్లో కలిగే అనురోధాలు మాత్రమేనేమో ? ఏమైనా తన దోషాల కింతకు మునుపు ప్రపంచం బాధ్యమని ఆరోపించేవాడు ఇప్పుడు వాటి ప్రసక్తే తలపెట్టటంలేదు. ఇప్పుడు తనలో ద్వేషం అంతరించింది. ఏ సన్నివేశం చూసినా, ఎవరిని తలచుకున్నా కళ్ళు చెమర్చి, హృదయం ద్రవించేటంత ప్రేమ అంకురిస్తోంది తనలో!

ఈ మధుర బాధలో, వలపులో, రాధాదేవి దివ్య సౌందర్యం ఆకాశంలో—తన హృదయ ఫలకంలోలా, స్వచ్ఛంగా తోస్తుంది.

'రావోయి! ఈరేయి రాధికాస్వామీ!'

—ఆమె సన్నగా, తియ్యగా, హాయిగా పాడుతుంది'! ఆమె తన ప్రణయిని !!

'జీవితంపు నిరాశచే చిక్కిచిక్కి ప్రాణమే పోయినను' బాయలేని ఆమె తన ఆరాధ్యమూర్తి !'

రాధ ఎవరని ప్రశ్నించుకుంటే 'వెలుగు నీడలవైపు వేలు చూపించింది' హృదయం!!

రాధ తనలో ఇప్పుడు రెండువిధాల జీవిస్తోంది ఆమె తన చిత్రాలలో జీవించింది కాని యావజ్జీవమూ తనను చిత్రాలతో జీవించనీయలేదు ఉన్మత్తమైన మనోహయాన్ని పట్టితెచ్చి మార్గం తప్పించింది! ఇప్పుడు తన ఆధ్యాత్మిక జీవితంలో అడుగడుగునా రాధ-వెలుగు తోడు తనకు!

ఎటుతిరిగీ—నాటికీ నేటికీకూడా తన శక్తి రాధే అయింది!

'ఇంక నను పిలచేర! ఇంత తలచేర?
ఎంకికేగాక నాకిట ఊరా పేరా?'

—తన చిత్రాల కీర్తి రాధదే! తన ప్రస్తుతౌన్నత్యమూ రాధదే!!

తన హృదయంలో ఉత్పన్నమవుతున్న ఆధ్యాత్మిక భావ సందోహంలో రాధ రూపులు మారుతూ రాణిస్తోంది దివ్యరాజ్ఞిలా—

ఆమె తన ప్రణయిని! తోడునీడ! శక్తి, సంసేవిత !!

ఆమె స్త్రీమూర్తి!

రాధ!!

* * *

భౌతికమై సంచరించే మనసు సూక్ష్మంలో లీనమైంది సూక్ష్మం విశాలమై అంతటా ఆవరించి ఉంది మనసు సూక్ష్మంలో లీనమవుతోంది సూక్ష్మం విశాలమౌతోంది రాధ విశ్వమంతా ఆక్రమిస్తోంది.

హృదయమే విశ్వం! విశ్వమే హృదయం!!

జీవిత సార్థకత! అదే పరమార్థం!!

'*Beyond the realm of thought,*
*He is freed being already freed*'★

